http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శనివారం 20 జూన్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## రాజ్యసభలో పెరుగుతున్న
# బీజేపీ బలం

- మూడింట రెండు వంతుల మెజారిటీ దిశగా ఎన్డీఏ..!
- వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఇప్పుడు రాజ్యసభలోనూ తన బలాన్ని మరింత పెంచుకుంటున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి
- ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏకు అనుకూలంగా రావడంతో, ఆ కూటమి సంఖ్యాబలం గణనీయంగా పెరిగింది
- దీంతో భవిష్యత్తులో కీలక బిల్లులను ఆమోదించుకునే దిశగా బీజేపీ మరింత బలపడుతున్నట్లు కనిపిస్తోంది



## మూసీ ప్రాజెక్టుకు
# గ్రీన్ సిగ్నల్

- మూసీ రివర్ ఫ్రంట్ కు కేంద్రం అనుమతి..
- ధన్యవాదాలు తెలిపిన రేవంత్ రెడ్డి
- రక్షణ శాఖ భూములు వినియోగించుకునేందుకు కేంద్రం అనుమతి
- 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగించుకోవడానికి క్లియరెన్స్ ఇచ్చిన కేంద్రం
- వేగవంతం కానున్న మూసీ ఫేజ్-1 పనులు



హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టులో ఒక కీలక ముందడుగు పడింది. హైదరాబాద్‌లోని బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుగా అంతర్జాతీయ - మిగతా3లో



## నీట్ రీ-ఎగ్జామ్‌కు
# లైన్ క్లియర్

- ఆ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు
- నీట్ రీ ఎగ్జామ్ నిలిపివేయాలని పిటిషన్
- తిరస్కరించిన సుప్రీంకోర్టు
- పిటిషన్లను అత్యవసరంగా విచారించలేమని స్పష్టం

## రాష్ట్ర, దేశ భవిష్యత్తు
# విద్యార్థుల చేతుల్లోనే

- 'తలరాతను మార్చేది చదువొక్కటే.. మీకేం కావాలో నాకు చెప్పండి'
- యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీ
- డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం 15 వేల మందితో ప్రతిజ్ఞ
- తెలంగాణ విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారన్న సీఎం రేవంత్ రెడ్డి
- విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని స్పష్టీకరణ
- గవర్నర్‌తో కలిసి విద్యార్థులకు యంగ్ ఇండియా కిట్లు పంపిణీ చేసిన సీఎం



హైదరాబాద్

పదేళ్లలో విధ్వంసానికి గురైన విద్యారంగాన్ని సమూల ప్రక్షాళన చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి ప్రభుత్వ, గురుకుల విద్యార్థులకు యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా 15 వేల మంది విద్యార్థులతో కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని ప్రశంసించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణ కోసం అందరూ కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

**సామూహిక ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్**

హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా ప్రతిష్ఠాత్మక పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యార్థులకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీ చేశారు. గురుకుల విద్యార్థులకు - మిగతా3లో



## మేకెదాటు డ్యామ్‌కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

- మేకెదాటు వద్ద కావేరి నదిపై కర్ణాటక నిర్మిస్తున్న ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానం
- ఈ ప్రాజెక్ట్ చట్ట విరుద్ధమన్న సీఎం విజయ్
- ఇటీవల మోదీని కలిసినప్పుడు ఇదే విషయాన్ని ప్రస్తావించిన విజయ్

## అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో కొత్త ట్విస్ట్

- సిమ్యులేటర్ డేటాతో కొత్త అంశాలను బయటపెట్టిన పైలట్లు!
- ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై పైలట్ల సమాఖ్య సంచలన ఆరోపణలు





## రాష్ట్రంలో ప్రభుత్వం కాదు..
# మాఫియా నడుస్తోంది

- కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు పూర్తిగా విసిగిపోయారు
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణలో ఎగిరేది గులాబీ జెండానే
- ఇప్పటినుంచే కార్యకర్తలే కథానాయకులై కదంతొక్కాలి
- ఎస్.ఐ.ఆర్ లో అర్హులైన ఓట్లు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోండి
- పార్టీ సభ్యత్వ నమోదును యాప్ ద్వారా ఇంటింటికి వెళ్లి విజయవంతం చేయండి
- మల్కాజ్ గిరి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## అమెరికా-ఇరాన్ చర్చలు వాయిదా..

- ఇటీవల అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రక ఒప్పందం
- కొనసాగింపుగా స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన అమెరికా-ఇరాన్ చర్చలు
- ఒప్పందం అమలు, పర్యవేక్షణపై ఈ చర్చలు
- అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటన వాయిదా పడినట్టు వైట్‌హౌస్ ప్రకటన
- సాంకేతిక, లాజిస్టిక్ కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడి






## పరీక్షల నిర్వహణలో లోపాలతో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు పరిహారమివ్వాలి

- ప్రధానికి కాక్రోచ్ పార్టీ చీఫ్ లేఖ
- పరీక్షల్లో గందరగోళం కారణంగా విద్యార్థుల బలవన్మరణంపై కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు దీప్కే ఆందోళన
- బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని ప్రధాని మోదీకి లేఖ
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్?

## 4 కేటగిరీలు
# 318 పనులు

- వీబీ జీరాంజీ జాబితా విడుదల చేసిన కేంద్రం
- ప్రస్తుతం ఉన్న ఎమ్‌జీఎన్ఆర్ఈజీఏలో 266 పనులు మాత్రమే
- జీరాంజీలో మౌలిక సదుపాయాలు కాకుండా మిగిలిన మూడింటిలో మార్పు
- వీబీ జీ - రామ్‌జీ పై కేంద్రానికి సీతక్క లేఖ



హైదరాబాద్

జులై నెల 1 నుంచి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ గ్రామీణ్(వీబీ-జీ రాం జీ) ప్రారంభం కానుంది. ఈ పథకంలో గ్రామీణ జీవనోపాధి, జల సంరక్షణ, మౌలిక వసతులు, విపత్తు నిర్వహణ కేటగిరీల్లో 318 పనులు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. గురువారం దానికి సంబంధించిన పనుల జాబితాను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విబీ-జీ రాం జీ పథకం అమలుకు ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసి, నిధులను కేటాయించింది. ప్రస్తుతం నడుస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోనూ - మిగతా3లో

# నీట్ రీ-ఎగ్జామ్‌కు లైన్ క్లియర్



వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ రీ ఎగ్జామ్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ఈ పరీక్షను నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. జూన్ 21న జరగబోయే రీ ఎగ్జామ్ యథాతథంగా కొనసాగుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇటీవల పరీక్ష నిలిపివేయాలంటూ కొందరు విద్యార్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం అందుకు నిరాకరించింది. పిటిషన్లను అత్యవసరంగా విచారణ జరపాలంటూ అభ్యర్థుల తరఫు న్యాయవాది కోరగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసం దాన్ని తోసిపుచ్చింది. నీట్‌కు సంబంధించిన అన్నీ పిటిషన్లు జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ముందుకు వెళ్లాయని వీటిని కూడా ఆ ధర్మాసనమే విచారిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు వేసిన పిటిషన్లలో అత్యవసర పరిస్థితి లేదని ఆయన తేల్చిచెప్పారు. పేపర్ లీకేజీ, అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో సమస్యలు ఉన్నాయన్న పిటిషన్లను ఈ మేరకు సుప్రీంకోర్టు కొట్టివేసింది విద్యార్థులు, నీట్-యూజీ అభ్యర్థులు దాఖలు చేసిన ఒక ప్రత్యేక పిటిషన్‌పై తక్షణమే విచారణ చేపట్టాలని న్యాయవాది అదీల్ అహ్మద్ కోరారు. అభ్యర్థుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని జూన్ 21న పరీక్ష నిర్వహించే సాధ్యాసాధ్యాలను పునఃపరిశీలించాలని ఈ మేరకు కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. “మానసిక క్షోభ, తీవ్ర ఆందోళన, పరీక్ష రద్దు కావడం వల్ల తలెత్తిన అనిశ్చితి, తగినంత సన్నద్ధత సమయం లేకపోవడం, పరీక్ష సమగ్రతపై అనుమానాలు, ఇతర పరీక్షలతో తేదీలు ఒకేలా ఉండటం, నిర్వహణాపరమైన ఇబ్బందులు, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు వంటి అంశాల నేపథ్యంలో ఈ విజ్ఞప్తులు వస్తున్నాయి.” అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

**రీ ఎగ్జామ్ నిర్వహించాలన్న నిర్ణయాన్ని ఎవరూ సవాలు చేయలేదు : పిటిషనర్**

అయితే, రీ ఎగ్జామ్ నిర్వహించాలన్న నిర్ణయాన్ని ఎవరూ సవాలు చేయలేదని, అభ్యర్థులకు తగినంత సన్నద్ధత సమయం ఇవ్వకుండా రీ ఎగ్జామ్ తేదీని ఏకపక్షంగా, అసమంజసంగా నిర్ణయించారని మాత్రమే పిటిషన్?లో పేర్కొన్నారని న్యాయవాది తెలిపారు. “రీ ఎగ్జామ్?కు? సంబంధించిన వాతావరణం, ప్రశ్నపత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణలు, లీక్ అయినట్లు చెబుతున్న ప్రశ్నపత్రాలు, సోషల్ మీడియాలో వదంతులు, విస్తృతమైన తప్పుడు సమాచారం వంటి వాటితో నిండిపోయింది. దీనివల్ల అధికారులు పదేపదే స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరీక్షా ప్రక్రియ రద్దు, తదనంతర వివాదాల కారణంగా చీజుజు అభ్యర్థులు తీవ్ర మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొందరు అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్న వార్తలు కూడా వచ్చాయని బహిరంగ నివేదికలు వెల్లడించాయి.” అని పిటిషన్ పేర్కొంది. బాధిత అభ్యర్థులందరికీ పరీక్షకు సిద్ధమయ్యేందుకు తగినంత సమయం కల్పించిన తర్వాతే నిర్వహించాలని కోరారు. పరీక్షను వాయిదా వేసి కొత్త తేదీని ఖరారు చేయాలని అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

**జూన్ 21న రీ-ఎగ్జామ్**

దేశవ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3న నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహించారు. అయితే ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 12న ఎన్‌టీఏ ఆ పరీక్షను రద్దు చేసింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే రీ-ఎగ్జామ్?ను జూన్ 21న నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షకు సిద్ధమవుతున్న లక్షలాది మంది విద్యార్థులు చివరి దశలో వదంతులను పట్టించుకోకుండా, తమ సన్నద్ధతపై విశ్వాసం ఉంచి పరీక్షకు హాజరుకావాలని ఎన్‌టీఏ మరోసారి చెప్పింది.

# పరీక్షల నిర్వహణల్లో లోపాలతో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు పరిహారమివ్వాలి




దేశంలో పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలు, పేపర్ లీక్?ల వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పరీక్షల గందరగోళం కారణంగా బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు. తమ జీవిత కాలపు సొమ్మును ధారపోసి చదివించిన పిల్లలనే కోల్పోయి, ఆ కుటుంబాలు పూర్తిగా నిరుపేదలుగా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలన్న తమ సంస్థ డిమాండ్‌ను దీప్కే పునరుద్ఘాటించారు. ఒకవేళ ప్రభుత్వం ఈ విషయంలో వెనకడుగు వేస్తే, ప్రస్తుత విద్యా వ్యవస్థలోని లోపాలను అంగీకరిస్తున్నట్లుగానే భావించాల్సి ఉంటుందని చెప్పారు.

పరీక్షల అనిశ్చితి భరించలేక గత కొన్ని వారాల్లోనే దేశంలో 11 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారని, అందులో 5 మరణాలు గడచిన 48 గంటల్లోనే జరిగాయని మోదీకి రాసిన లేఖలో అభిజీత్? పేర్కొన్నారు. అయితే, మంత్రి ధర్మేంద్రను తొలగించడం ప్రభుత్వ బలహీనతను కాకుండా జవాబుదారీతనం పట్ల నిబద్ధతను ప్రదర్శిస్తుందని ఆయన అన్నారు. మరోవైపు, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ విద్యా వ్యవస్థలో తక్షణ సంస్కరణలు తీసుకురావాలని తెలిపారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం పూర్తిగా సన్నగిల్లుతుందని దీప్కే పేర్కొన్నారు.

**జూన్ 20న జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన**

ఇదిలా ఉండగా, జూన్ 20న కాక్రోచ్ జనతాపార్టీ రెండోసారి తన నిరసన ప్రదర్శనను చేపట్టనుంది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తన నిరసనలను కొనసాగించనుంది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చింది. అంతకుముందు, జూన్ 6న చేపట్టిన నిరసన కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్షలు, నియామక పరీక్షల్లో జరిగిన అవకతవకల ఆరోపణలపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయితే, మొదటి నిరసనకు మంచి స్పందన రావడంతో, ప్రస్తుతం ఉద్యమాన్ని దేశంలోని ఇతర నగరాలకు కూడా విస్తరించాలని సీజేపీ యోచిస్తోంది.

**నిరసన ప్రదర్శనలో దీప్కేపై దాడి**

ఇదిలా ఉండగా, కొద్దిరోజుల క్రితం అభిజీత్ దీప్కేపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. జైపూర్‌లో నిరసన కార్యక్రమంలో అతడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండగా, కొందరు వ్యక్తులు అతడి వద్దకు దూసుకువచ్చారు. దీప్కే మద్దతుదారులు ఆయనను తమ భుజాలపైకి ఎత్తుకున్న సమయంలో, గుంపులో ఉన్న కొందరు అభిజీత్ చెంపపై కొడుతూ, దాడికి పాల్పడ్డారు. దీంతో అక్కడే ఉన్న సీజేపీ కార్యకర్తలు వెంటనే స్పందించి, దీప్కేను కొట్టిన వ్యక్తులపై మూకుమ్మడి దాడి చేశారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, ఆ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో ఫుల్? వైరలయ్యాయి. అయితే, ఈ విషయంపై అభిజీత్ స్పందిస్తూ, భౌతిక దాడులు పిరికితనానికి నిదర్శమని చెప్పారు. ఇలాంటి దాడులకు భయపడేది లేదని, ప్రజా సమస్యలపై శాంతియుత మార్గంలో తమ గళాన్ని వినిపిస్తూనే ఉంటామని ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురవ్వద్దని యువతకు సూచించారు. మరోవైపు, జైపుర్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం వద్ద సీజేపీ నిరసన చేపట్టిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే, అభిజీత్‌పై దాడి చేసిన నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో కొత్త ట్విస్ట్



గత ఏడాది జూన్ 12న అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే కుప్పకూలిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ 171 ప్రమాదంపై కొత్త వివాదం రాజుకుంది. ఈ దుర్ఘటన పైలట్ ఆత్మహత్య వల్లే జరిగిందన్న అధికారిక వాదనను ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్ఐపీ) తీవ్రంగా సవాల్ చేసింది. ఇది ఆత్మహత్య కాదని, విమానంలో తలెత్తిన భారీ విద్యుత్ వైఫల్యం వల్లే ప్రమాదం జరిగిందని, అందుకు తమ వద్ద తిరుగులేని సాంకేతిక ఆధారాలున్నాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎఫ్ఐపీ అధ్యక్షుడు కెప్టెన్ సి.ఎస్. రంధావా మీడియా సమావేశంలో సంచలన విషయాలు వెల్లడించారు. ప్రభుత్వ దర్యాప్తు సంస్థల మధ్యంతర నివేదిక ప్రకారం... ఓ పైలట్ ఉద్దేశపూర్వకంగా ఇంధన సరఫరాను నిలిపివేయడంతో విమానం కూలిపోయిందని పేర్కొన్నారు. ఇంధన సరఫరా నిలిచిన కేవలం 4 సెకన్లలోనే విమానంలోని అత్యవసర విద్యుత్ వ్యవస్థ అయిన ‘రామ్ ఎయిర్ టర్బైన్’ (ఆర్ఏటీ) యాక్టివేట్ అయిందని నివేదిక తెలిపింది. అయితే, ఈ వాదనను ఎఫ్ఐపీ పూర్తిగా తోసిపుచ్చింది. ప్రమాద సమయంలోని బరువు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తాము నిర్వహించిన సిమ్యులేటర్ పరీక్షల్లో భిన్నమైన ఫలితాలు వచ్చాయని రంధావా తెలిపారు. “మా సిమ్యులేటర్ పరీక్షల ప్రకారం పైలట్లు ఇంధన సరఫరాను మాన్యువల్‌గా నిలిపివేస్తే, బ్యాకప్ టర్బైన్ పనిచేయడానికి కనీసం 18 సెకన్ల సమయం పడుతుంది. కానీ, అధికారిక నివేదికలో చెప్పినట్లు కేవలం 4 సెకన్లలోనే అది యాక్టివేట్ కావడం భౌతికంగా, సాంకేతికంగా అసాధ్యం” అని ఆయన వివరించారు. విమానంలో ఒక్కసారిగా భారీ విద్యుత్ వైఫల్యం సంభవించడం వల్లే బ్యాకప్ టర్బైన్ అంత వేగంగా పనిచేయడం మొదలుపెట్టిందని, ఆ తర్వాతే ఇంజిన్ స్విచ్‌లు ట్రిప్ అయ్యాయని ఎఫ్ఐపీ వాదిస్తోంది. ఈ వాదనకు బలం చేకూరుస్తూ మరిన్ని ఆధారాలను ఎఫ్ఐపీ తెరపైకి తీసుకువచ్చింది. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక ప్రయాణికుడు, విమానం కిందకు పడిపోవడానికి ముందు క్యాబిన్‌లోని లైట్లు మిణుకుమిణుకుమన్నాయని చెప్పిన విషయాన్ని గుర్తుచేసింది. ఇది విద్యుత్ వైఫల్యం వాదనకు సరిగ్గా సరిపోతుందని పేర్కొంది. అంతేకాకుండా ప్రమాదానికి గురైన విమానంలో గతంలోనూ పలుమార్లు విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తినట్లు రికార్డులు ఉన్నాయని సమాఖ్య తెలిపింది. దర్యాప్తు తీరుపై కూడా ఎఫ్ఐపీ తీవ్ర ఆరోపణలు చేసింది. భారత్‌లో అత్యుత్తమ బోయింగ్ 787 నిపుణుడిగా పేరున్న కెప్టెన్ ఆర్.ఎస్. సంధును ఉద్దేశపూర్వకంగానే దర్యాప్తు పరీక్షల నుంచి తప్పించారని రంధావా ఆరోపించారు. “ఆయనకున్న పరిజ్ఞానంతో ‘పైలట్ సూసైడ్’ థియరీ తప్పని తేలిపోతుంది. అందుకే ఆయన్ను పక్కనపెట్టారు. చనిపోయిన పైలట్లు తమను తాము సమర్థించుకోలేరు కాబట్టి, వారిపై నిందలు వేయడం సులభం. కానీ, విమానంలోని యాంత్రిక లేదా సాఫ్ట్‌వేర్ లోపాన్ని అంగీకరించడం ఇష్టం లేకే ఈ కుట్ర చేస్తున్నారు” అని రంధావా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ సిమ్యులేటర్ డేటాను, పరిశోధన ఫలితాలను బోయింగ్ సంస్థకు, ప్రభుత్వ ఏవియేషన్ అధికారులకు సమర్పించినట్లు ఎఫ్ఐపీ ధ్రువీకరించింది. టర్బైన్ యాక్టివేషన్ సమయంపై ఉన్న సాంకేతిక వైరుధ్యాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపే వరకు ప్రమాద తుది నివేదిక ప్రచురణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. పారదర్శక దర్యాప్తు కోసం కెప్టెన్ సంధును వెంటనే విచారణ బృందంలో తిరిగి చేర్చుకోవాలని కోరింది. ఎఫ్ఐపీ చేసిన ఈ ఆరోపణలతో విమాన ప్రమాద దర్యాప్తు మరోసారి కీలక మలుపు తీసుకుంది.

## రాజ్యసభలో పెరుగుతున్న బీజేపీ బలం..

కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఇప్పుడు రాజ్యసభలోనూ తన బలాన్ని మరింత పెంచుకుంటున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏకు అనుకూలంగా రావడంతో, ఆ కూటమి సంఖ్యాబలం గణనీయంగా పెరిగింది. దీంతో భవిష్యత్తులో కీలక బిల్లులను ఆమోదించుకునే దిశగా బీజేపీ మరింత బలపడుతున్నట్లు కనిపిస్తోంది. జూన్ 18 వరకు దేశంలోని 10 రాష్ట్రాల్లో 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఎక్కువ స్థానాలు ఎన్డీఏ ఖాతాలోకి వెళ్లాయి. తొలుత ఏకగ్రీవంగా ఎన్నికైన 24 మంది సభ్యుల్లో 19 మంది ఎన్డీఏ కూటమికి చెందినవారు కాగా, జార్ఖండ్‌లో జరిగిన ఎన్నికలో పరిమల్ నత్వానీ విజయం సాధించడంతో ఆ సంఖ్య 20కి చేరింది. ప్రస్తుతం రాజ్యసభలో ఎన్డీఏ కూటమి మొత్తం బలం 152 స్థానాలకు చేరినట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా రాజ్యాంగ సవరణలకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీకి ఎన్డీఏ కేవలం 11 సీట్ల దూరంలో ఉండటం విశేషం. దీంతో భవిష్యత్తులో రాజ్యాంగ సవరణలకు సంబంధించిన కీలక బిల్లులను సులభంగా ఆమోదించే అవకాశం ఏర్పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు కూడా ఎన్డీఏకు కలిసి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేయడంతో ఆ స్థానాలపై చర్చ మొదలైంది. భవిష్యత్తులో మరికొంతమంది ఎంపీలు కూడా పార్టీని వీడే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. అలాంటి పరిస్థితి ఏర్పడితే, ఆ ఖాళీ స్థానాలను బీజేపీ దక్కించుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో బిజూ జనతా దళ్ (బీజేడీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) వంటి పార్టీలు అధికారికంగా ఏ కూటమిలోనూ లేకపోయినా, పలు కీలక సందర్భాల్లో ఎన్డీఏకు మద్దతు ఇస్తూ వచ్చాయి. బీజేడీకి ఐదుగురు, వైఎస్సార్‌సీపీకి ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఉండటం కూడా ఎన్డీఏకు అదనపు బలంగా మారే అవకాశం ఉంది.

ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష భారత కూటమి బలం తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి మిత్రపక్షాలు దూరం కావడంతో ఆ కూటమి సంఖ్య 64 మంది సభ్యుల వద్దే నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో రాజ్యసభలో ఎన్డీఏ ఆధిపత్యం మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాలు దేశ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

## అమెరికా-ఇరాన్ చర్చలు వాయిదా..



అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన కీలక చర్చలు వాయిదా పడ్డాయి. ఈ చర్చల్లో ఖతార్, పాకిస్థాన్ కూడా పాల్గొనాల్సి ఉంది. ఈ విషయాన్ని స్విట్జర్లాండ్ విదేశాంగ శాఖ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. చర్చల నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నామని, దానికి సంబంధించిన సన్నాహక పనులు కొనసాగుతున్నాయని తెలిపింది. ప్రస్తుతానికి దీనిపై మరింత సమాచారం ఇవ్వలేమని పేర్కొంది. మరోవైపు, ఇరాన్‌తో సాంకేతిక చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేపట్టాల్సిన పర్యటన వాయిదా పడినట్టు వైట్‌హౌస్ వెల్లడించింది. అయితే, చర్చల కోసం సన్నాహాలు కొనసాగుతున్నాయని, ఇటీవల కుదిరిన అవగాహన ఒప్పందం అమలు లక్ష్యంగా తదుపరి దశ చర్చలు ప్రారంభించడంపై ఇరుపక్షాలు దృష్టి సారించాయని తెలిపింది. “లాజిస్టిక్స్ పరమైన అంశాలు ఎప్పుడూ సులభంగా ఉండవు” అని వైట్‌హౌస్ ప్రతినిధి పేర్కొన్నారు. అంతకుముందు, వైట్‌హౌస్‌లో మాట్లాడిన వాన్స్.. ఈ వారాంతంలోనే చర్చలు ప్రారంభం కావచ్చని అంచనా వేశారు. అయితే, ఇరాన్ నుంచి ప్రతినిధులు బయటకు రావడం అంత సులభం కాదని, సమన్వయం సవాలుగా మారిందని ఆయన అంగీకరించారు. అమెరికా బృందానికి తానే నాయకత్వం వహించనున్నట్టు స్పష్టం చేశారు. ఇప్పటికే కుదిరిన రాజకీయ ఒప్పందాన్ని ఆచరణలో పెట్టడం, దాని అమలు, పర్యవేక్షణ, నిబంధనలపై స్పష్టత కోసం ఈ చర్చలు జరగాల్సి ఉంది. “మేము మాటలను నమ్మం. చేతలను, ప్రవర్తనను మాత్రమే విశ్వసిస్తాం” అని వాన్స్ పేర్కొంటూ, చర్చల్లో అమెరికా వైఖరి ఎలా ఉండబోతోందో స్పష్టం చేశారు. ప్రస్తుతానికి కొత్త షెడ్యూల్‌ను ప్రకటించనప్పటికీ, వీలైనంత త్వరగా చర్చలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

## మేకెదాటు డ్యామ్‌కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం



కావేరీ నదీ జలాల పంపిణీ విషయంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా సాగుతున్న వివాదం.. ‘మేకెదాటు డ్యామ్’ ప్రతిపాదనతో మరోసారి తీవ్రరూపం దాల్చింది. కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద కొత్త డ్యామ్ నిర్మాణానికి జరుపుతున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ ఉదయం తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ ఒక కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి అధికార పక్షంతో పాటు కాంగ్రెస్, వీసీకే, ఇతర రాజకీయ పక్షాలు పూర్తి మద్దతు ప్రకటించడంతో అసెంబ్లీ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది. అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా విజయ్ మాట్లాడుతూ... కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మేకెదాటు ప్రాజెక్ట్ చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ కావేరి నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్ ఇచ్చిన తుది అవార్డుతో పాటు, ఈ విషయమై గతంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ డ్యామ్ నిర్మాణం గనుక చేపడితే దిగువన ఉన్న తమిళనాడులోని కావేరి డెల్టా పరివాహక ప్రాంత రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని, వారి జీవనాధారం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎలాంటి పర్యావరణ, సాంకేతిక అనుమతులు మంజూరు చేయకూడదని తీర్మానం ద్వారా డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ తీర్మానానికి ముందే, గత నెలలో విజయ్ ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణాన్ని తక్షణమే అడ్డుకోవాలని కోరుతూ ఆయనకు ఒక సమగ్ర వినతి పత్రాన్ని సమర్పించారు. కావేరి నదీ జలాల నిర్వాహక మండలిలో సభ్యులుగా ఉన్న ఇతర బేసిన్ రాష్ట్రాల (తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి) రాతపూర్వక అనుమతి, ఆమోదం లేకుండా కర్ణాటక ఏకపక్షంగా మేకెదాటు ప్రాజెక్టును చేపట్టడానికి వీల్లేదని విజయ్ ప్రధానికి వివరించారు. ఈ విషయమై కర్ణాటకకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర నీటి వనరుల శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన ప్రధాని మోదీని అభ్యర్థించారు. తమిళనాడు సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న ఈ సున్నితమైన అంశంపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడంతో ఇప్పుడు బంతి కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి వెళ్లింది.

# సంపాదకీయం

## ఏఐకీ సరిహద్దులా?

ఇప్పుడు కృత్రిమ మేధస్సు (ఏఐ) రూపంలో ప్రారంభమైన కొత్త విప్లవం, మానవ నాగరికతను కొత్త దిశలో నడిపిస్తోంది. అయితే అదే సమయంలో ఒక కీలకమైన ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. భూమిపై ఉన్న సరిహద్దులు సరిపోలేదన్నట్లు ఇకపై అత్యాధునిక సాంకేతికతలకు కూడా దేశాల వారీగా సరిహద్దులు ఏర్పడతాయా? ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చకు కారణమైన ఆంత్రోపిక్ వివాదం ఈ ప్రశ్నను మరింత బలంగా వినిపిస్తోంది. అత్యాధునిక ఏఐ మోడళ్లపై జాతీయ భద్రత, సైబర్ భద్రత పేరుతో ఆంక్షలు విధించాలనే ఆలోచన కేవలం ఒక సంస్థకు సంబంధించిన విషయం కాదు. ఇది భవిష్యత్తులో ప్రపంచం ఏఐని ఎలా చూడబోతోందో చెప్పే సంకేతం. ఒకప్పుడు చమురు ఎవరి వద్ద ఉందో వారే ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేశారు. ఆ తర్వాత అణు సాంకేతికత ప్రపంచ శక్తి సమీకరణాలను నిర్ణయించింది. ఇటీవల సెమీ కండక్టర్ చిప్స్‌పై ఆధిపత్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా మారింది. ఇప్పుడు అదే స్థానాన్ని కృత్రిమ మేధస్సు ఆక్రమిస్తోంది. ఏఐ ఇకపై ఒక సాధారణ సాఫ్ట్‌వేర్ కాదు. అది ఒక దేశ ఆర్థిక శక్తిని, సైనిక సామర్థ్యాన్ని, పరిశోధన వేగాన్ని, సైబర్ భద్రతను, అంతర్జాతీయ ప్రభావాన్ని నిర్ణయించే వ్యూహాత్మక ఆస్తిగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ప్రభుత్వాలు ఏఐని కేవలం మార్కెట్ ఉత్పత్తిగా కాకుండా జాతీయ భద్రతా సాధనంగా చూడటం ప్రారంభించాయి. దీనిలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే నేటి ఫ్రంటియర్ ఏఐ మోడళ్లు కేవలం సంభాషణలు చేసే చాట్‌బాట్లు కావు. అవి లక్షల పేజీల సమాచారాన్ని విశ్లేషిస్తాయి. క్లిష్టమైన శాస్త్రీయ పరిశోధనలకు సహకరిస్తాయి. సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రాస్తాయి. వైద్య రంగం నుంచి రక్షణ రంగం వరకు అనేక వ్యవస్థల పనితీరును ప్రభావితం చేస్తాయి. ఈ సామర్థ్యాలే వాటిని అసాధారణంగా, శక్తిమంతంగా మారుస్తున్నాయి. ఇక్కడే ఒక పెద్ద ప్రశ్న తలెత్తుతోంది. ఇంతటి శక్తి కలిగిన సాంకేతికత పూర్తిగా అందరికీ అందుబాటులో ఉండాలా? లేక కొన్ని పరిమితులు అవసరమా? చరిత్ర చెబుతున్న ఒక వాస్తవం ఏమిటంటే... అపార శక్తి ఉన్న ప్రతి సాంకేతికత చివరకు నియంత్రణల పరిధిలోకి వచ్చింది. అణుశక్తి అందరికీ అందుబాటులో లేదు. అత్యాధునిక ఆయుధ సాంకేతికతలపై ఆంక్షలు ఉన్నాయి. సూపర్ కంప్యూటర్ల ఎగుమతులపై కూడా ఎన్నో దేశాలు పరిమితులు విధించాయి. ఇప్పుడు అదే తర్కం ఏఐ విషయంలో వినిపిస్తోంది. అయితే ఏఐ పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. ఎందుకంటే అణు సాంకేతికత కొద్ది దేశాలకు మాత్రమే పరిమితం. కానీ ఏఐ మాత్రం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది పరిశోధకుల, డెవలపర్ల, విద్యార్థుల సహకారంతో అభివృద్ధి చెందుతోంది. దీనిపై అతిగా నియంత్రణలు విధిస్తే ఆవిష్కరణలు మందగించే ప్రమాదం ఉంది. జ్ఞానం కొద్ది దేశాల చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే అవకాశం ఉంది. ఫలితంగా సాంకేతిక అసమానతలు మరింత పెరగవచ్చు. అంతేకాదు, ఏఐపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రపంచం కొత్త తరహా డిజిటల్ శీతల యుద్ధంలోకి ప్రవేశించే ప్రమాదం కూడా ఉంది. ఒకవైపు అమెరికా, మరోవైపు చైనా, మధ్యలో యూరప్, ఇతర దేశాలు తమ ఏఐ పర్యావరణ వ్యవస్థలను నిర్మించుకునే దిశగా వెళితే ఇంటర్నెట్ యుగంలో మనం చూసిన ఓపెన్ గ్లోబల్ సహకారం క్రమంగా తగ్గిపోవచ్చు. భవిష్యత్తులో ఒక దేశంలో అందుబాటులో ఉన్న ఏఐ మరో దేశంలో నిషేధించే పరిస్థితులు కూడా రావచ్చు. ఈ నేపథ్యంలో భారతదేశం పాత్ర అత్యంత కీలకంగా మారుతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా, అత్యంత వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, అపారమైన సాఫ్ట్‌వేర్ ప్రతిభ, విభిన్న భాషా సంపద... ఇవన్నీ భారతదేశానికి ప్రత్యేక బలం. కానీ ఈ బలం కేవలం వినియోగదారుల సంఖ్యకే పరిమితమైతే ప్రయోజనం ఉండదు. భవిష్యత్తులో ఏఐ ఆధిపత్యం ప్రపంచ రాజకీయాలను నిర్ణయించే స్థాయికి చేరుకుంటే, ఇతర దేశాల మోడళ్లను ఉపయోగించే దేశంగా కాకుండా సొంత సాంకేతిక సామర్థ్యాన్ని నిర్మించుకున్న దేశంగా భారత్ నిలవాలి. అందుకే ఇండియా ఏఐ మిషన్, స్వదేశీ లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లు, దేశీయ డేటా సెంటర్లు, అధునాతన కంప్యూటింగ్ మౌలిక వసతులు, చిప్ తయారీ సామర్థ్యాలు, భారతీయ భాషల కోసం ప్రత్యేక ఏఐ వ్యవస్థల అభివృద్ధి అత్యవసరంగా మారాయి. ఇది కేవలం సాంకేతిక అభివృద్ధి కోసం కాదు. భవిష్యత్తు డిజిటల్ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడానికి కూడా అవసరం. అయితే ప్రపంచం ముందు ఉన్న అసలు సవాలు మరొకటి. భద్రత పేరుతో ఆవిష్కరణలను అణచివేయకూడదు. అదే సమయంలో స్వేచ్ఛ పేరుతో ప్రమాదాలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యతను కనుగొనడమే రాబోయే దశాబ్దంలో ప్రపంచ ప్రభుత్వాల ముందున్న అతిపెద్ద సవాలు. ఆంత్రోపిక్ వివాదం త్వరలో ముగిసిపోవచ్చు. ఆంక్షలు ఎత్తివేయవచ్చు. కానీ, ఈ సంఘటన ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. కృత్రిమ మేధస్సు ఇకపై కేవలం ఒక సాంకేతిక ఉత్పత్తి కాదు. అది భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థలను, జాతీయ భద్రతను, అంతర్జాతీయ శక్తి సమీకరణాలను, దేశాల ప్రభావాన్ని నిర్ణయించే వ్యూహాత్మక సాధనం. అందుకే రేపటి ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన ప్రశ్న 'ఎవరి వద్ద అత్యంత తెలివైన ఏఐ ఉంది?' అనేది కాకపోవచ్చు. 'ఆ ఏఐని నియంత్రించే శక్తి ఎవరి చేతుల్లో ఉంది?' అన్నదే కావచ్చు. ప్రపంచం ఇప్పుడు ఒక కొత్త యుగం ద్వారం వద్ద నిలబడి ఉంది. ఆ యుగంలో దేశాల మధ్య సరిహద్దులు కేవలం భూమిపైనే కాదు... డేటాలో, చిప్స్‌లో, ఆల్గోరిథమ్‌లలో, కృత్రిమ మేధస్సులో కూడా కనిపించే అవకాశం ఉంది. అదే జరిగితే, భవిష్యత్తు ప్రపంచ రాజకీయాల కేంద్ర బిందువు భౌగోళిక పటాలు కాదు... డిజిటల్ పటాలే అవుతాయి.

# ఆర్థిక వివేకం లేని అధికార లాలస

ఇప్పటికి కనీసం ఒక ఏడాది కాలంగా భారత ఆర్థిక వ్యవస్థ పరిస్థితి ఆరోగ్యకరంగా లేదు. రూపాయి విలువ బాగా పడిపోయింది, దేశం నుంచి పెట్టుబడి తరలిపోతోంది. దేశీయ ప్రైవేట్ మదుపులు వెనుకబడ్డాయి. వినియోగ డిమాండ్ తగ్గిపోయింది. వస్తూత్పత్తి రంగం స్తబ్ధమయింది. సంపన్నులు, అంతగా సంపన్నులు కాని వారి మధ్య ఆర్థిక వ్యత్యాసాలు వేగంగా పెరుగుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా అగ్రగామి ఐటీ కంపెనీల షేర్ల విలువలు పడిపోతున్నాయి. ఈ బహువిధ సమస్యలన్నిటినీ మార్కెట్ మూడ్ ప్రతిబింబిస్తోంది. ప్రధాన సూచీలు అన్నీ రెండు సంవత్సరాల క్రితం ఎక్కడ ఉన్నాయో ఇప్పుడూ అక్కడే ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల తీవ్రతను అంగీకరించి వాటిని అధిగమించేందుకు అవసరమైన సంస్కరణలకు సత్వరమే శ్రీకారం చుట్టాలని మోదీ ప్రభుత్వానికి పలువురు ఆర్థికవేత్తలు విజ్ఞప్తి చేస్తున్నారు. జాతీయ దినపత్రికలలో ఈ విషయమై వారు వ్యాసాలు రాస్తున్నారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం ప్రారంభమైన తరువాత ఆ వ్యాసాలు దాదాపు ప్రతి రోజూ ప్రచురితమవుతున్నాయి. గ్యాస్, ఎరువులు, ఇతర సరుకుల మార్కెట్లపై యుద్ధం ప్రతికూల ప్రభావం చూపుతోంది. యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాలలోని ప్రవాస భారతీయులు స్వదేశానికి పంపించే నిధులు తగ్గిపోయాయి. తత్ఫలితంగా మన విదేశీ మారకద్రవ్య నిల్వలు మరింతగా తగ్గిపోయాయి. కస్టమ్స్ అధికారులు, పన్ను వసూళ్ల యంత్రాంగంతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించేలా చేయడంతో సహా పలు సంస్కరణ చర్యలను ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. ఆరోగ్య భద్రత, విద్యపై మరింత ఎక్కువగా ఖర్చు చేయాలని, శ్రమ సాంద్ర వస్తూత్పత్తి రంగాన్ని ప్రోత్సహించాలని, మదుపుదారులకు సమానావకాశాలు సృష్టించాలని, తమకు ప్రీతిపాత్రులైన పెట్టుబడిదారులు మాత్రమే అత్యధిక ప్రాజెక్టులను స్వాయత్తం చేసుకోకుండా నిరోధించాలని, ఎరువుల, విద్యుత్ సబ్సిడీలను తగ్గించాలని, బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై వివక్షకు స్వస్తి చెప్పాలని, ఆర్థిక వ్యవహారాల సంబంధిత మంత్రిత్వ శాఖలలో అత్యున్నత బాధ్యతల్లో ఉండి తమ విధ్యుక్త ధర్మాలను సమర్థంగా నిర్వహించని రాజకీయవేత్తలు, అధికారుల స్థానంలో బాగా సమర్థులైన, దీక్షాదక్షతలు ఉన్న వారిని నియమించాలని కూడా ఆర్థికవేత్తలు స్పష్టంగా సూచిస్తున్నారు. మన ప్రముఖ ఆర్థికవేత్తల సిఫారసులు కుల మతాలు, జెండర్, ప్రాంతాలు, రాజకీయ విశ్వాసాలకు అతీతంగా సమస్త భారతీయులకు సంక్షేమం, ఆర్థిక భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా ఉన్నాయనడంలో సందేహం లేదు. వారి సూచనలకు అదనంగా నేనూ నా సొంత సూచన ఒకటి చేయదలిచాను: ఎల్లెడలా వాయు, నీటి కాలుష్యాన్ని పెంపొందిస్తూ నేల సారాన్ని క్షీణింపజేస్తున్న, అడవులను నిర్మూలిస్తున్న పర్యావరణ విధ్వంసాన్ని అరికట్టాలి. కేంద్ర ప్రభుత్వం ఈ సిఫారసులను అంగీకరించి, వాటి అమలుకు పటిష్ఠ చర్యలు చేపడుతుందా? ఈ ప్రశ్నకు సమాధానం వ్యతిరిక్తంగా ఉంటుందని ఈ కాలమిస్టు విశ్వసిస్తున్నాడు. కేంద్ర ప్రభుత్వంలో అతి ముఖ్యులైన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్ షాలను ప్రేరేపిస్తున్న ఉద్దేశాలు, సంకల్పాలు ఏమిటో నిశితంగా పరిశీలిస్తే ఆ సమాధానం సరైనదని స్పష్టమవుతుంది. నా అవగాహన ప్రకారం, ప్రధానమంత్రిని మూడు ఆకాంక్షలు ప్రభావితం చేస్తున్నాయి. మొదటిది.. సాధ్యమైనంత వరకు పదవిలో కొనసాగడం. మోదీ ఇప్పటికే 75 సంవత్సరాలు పైబడిన వయసులో ఉన్నారు. అంత వయసు ఉన్న నాయకులను పార్టీ 'మార్గదర్శక్ మండల్'కు పంపాలని ఆయనే స్వయంగా సిఫారసు చేశారు. వయసు పెరుగుతున్నా అధికారం నుంచి వైదొలిగేందుకు మోదీ సిద్ధంగా లేరు. సార్వత్రక ఎన్నికలలో వరుసగా నాలుగో పర్యాయం కూడా విజయం సాధించాలనే పట్టుదల మోదీలో ప్రగాఢంగా ఉన్నది. తాను బహిరంగంగా



విమర్శిస్తూ, రహస్యంగా అసూయపడుతున్న జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించడమే మోదీ అభిమతం. తన వ్యక్తి పూజను మరింతగా ప్రోత్సహించడం మోదీ రెండో ఆకాంక్ష. ప్రభుత్వ ధనాన్ని భారీ మొత్తంలో ఇందుకు వెచ్చిస్తున్నారు. పెట్రోల్ పంపులు, విమానాశ్రయాలు, రైళ్లు, రైల్వే స్టేషన్లు ఇంకా డజన్ల కొద్దీ వేర్వేరు ప్రదేశాలలో సర్వే సర్వత్రా మోదీ బొమ్మ కనిపిస్తూనే ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ప్రదేశాలన్నిటిలోనూ మోదీ మీకు దర్శనమిస్తూనే ఉంటారు. ప్రధానమంత్రి స్వాతిశయానికి అవధులు లేవు. సదా ప్రజల దృష్టిలో ఉండాలని, సకల జనుల చేత ఆరాధింపబడాలని ఆయన ప్రగాఢంగా కోరు కుంటారు. ఎలాగైనా సరే 'హిందూ రాష్ట్ర'ను సృష్టించడం ఆయన మూడో ఆకాంక్ష. పన్నెండేళ్ల క్రితం 2014లో 'సబ్‌కా సాథ్, సబ్ కా వికాస్'కు కృషి చేస్తానని ప్రధానమంత్రి వాగ్దానం చేశారు. అయితే ఇచ్చినంత వేగంగానే ఆయన ఆ వాగ్దానాన్ని విడిచిపెట్టారు. ఇప్పుడు ఆయన తనను తాను హిందువుల నాయకుడుగా మాత్రమే నివేదించుకుంటున్నారు. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవంలో ఆయన పూజలు, సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణ అమృతోత్సవాలు మొదలైనవి అందుకు ఉదాహరణలు. నరేంద్ర మోదీ మూడు ఆశయాలలో అమిత్ షా రెండిటిని పూర్తిగా పంచుకుంటున్నారు: తనకు మరింతగా రాజకీయ అధికారం, హిందూ మెజారిటేరియనిజంను ప్రోత్సహించడం. ఎన్నికల కార్యకలాపాలలో ఆయన అంతకంతకూ ఎక్కువ సమయాన్ని గడపడం, ప్రభుత్వ వ్యవహారాలపై పెరుగుతున్న ఆయన ప్రభావం ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి: అమిత్ షా ఇంకెంత మాత్రం తననుతాను మోదీ విధేయ అనుయాయిగా కాకుండా మోదీకి అనివార్య రాజకీయ వారసుడుగా భావించుకుంటున్నారు. మోదీ వలే అమిత్ షా కూడా హిందూ రాష్ట్రను సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయన ఆశిస్తున్న హిందూ రాజ్యంలో ఇతర మతాల వారు... ముఖ్యంగా ముస్లింలు ద్వితీయశ్రేణి పౌరులుగా మాత్రమే ఉంటారు. హిందూ రాష్ట్ర స్వప్న సాకారానికి అమిత్ షా తన బాస్‌కంటే ఎక్కువగా కృషి చేస్తున్నారు. ముస్లింలను నిందించడం ఆయనకొక నిత్య వ్యాపకం. తమ రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకుని, విస్తరింపజేసుకోవడమే మోదీ, షాల పరమ ధ్యేయం. ఈ లక్ష్యం పైనే వారు తమ మనసును కేంద్రీకరించారు. పరస్పర సంబంధమున్న నాలుగు పరస్పర రీతుల్లో వారు ఆ లక్ష్యసాధనలో సఫలమయ్యారు. మొదటిది.. సంఘటిత హిందూ ఓటు బ్యాంకు నిర్మాణం. ముస్లిం మైనారిటీలు తమపై పెత్తనం చేసే రోజులు వస్తాయనే భయభ్రాంతులను హిందువులలో సృష్టిస్తున్నారు. తద్వారా వారిలో 60శాతం మంది బీజేపీకి ఓటు వేస్తే ఆ పార్టీ ఓట్ల వాటా ఇంచుమించు 45శాతంగా లేదా అంతకంటే ఎక్కువగా ఉంటుంది. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఈ ఓటు బ్యాంకు సరిపోతుంది. రెండోది.. మహిళలు, రైతులు మొదలైన సామాజిక వర్గాలకు క్రమబద్ధంగా నగదు చెల్లింపులు చేయడం. ఈ చెల్లింపుల సొమ్ము స్వల్పమే అయినా ప్రభుత్వం తమకు ఏదో ఒకటి చేస్తుంది కదా అనే సంతృప్తి ఓటర్లలో కలుగుతుంది. మూడోది.. ప్రభుత్వ సంస్థలపై పూర్తి నియంత్రణ సాధించి తమ రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా ఉపయోగించడం. ఇప్పటికే ఎన్నికల సంఘం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ విధంగా దుర్వినియోగమవుతున్నాయి. నాల్గవది.. ఎంపిక చేసుకున్న పెట్టుబడిదారులను ప్రోత్సహించడం. ప్రభుత్వం నుంచి కాంట్రాక్టులు పొందిన ఆ కుబేరులు బీజేపీకి ఆర్థిక వనరులు సమకూర్చుతారు. జూన్ 2013లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోను, 14 రాష్ట్రాల లోను అధికారంలో ఉన్నది. అప్పట్లో బీజేపీ కేవలం నాలుగు రాష్ట్రాలలో మాత్రమే అధికారంలో ఉన్నది. 2014 నుంచి మూడు సార్వత్రక ఎన్నికలను వరుసగా గెలిచిన బీజేపీ ఇప్పుడు 22 రాష్ట్రాలలో అధికారంలో ఉండగా కాంగ్రెస్ కేవలం ఐదు రాష్ట్రాలలో మాత్రమే అధికారంలో ఉన్నది. కాంగ్రెస్ పతనానికి కారణమేమిటి? పార్టీ నాయకత్వ అవివేకమే, బీజేపీ దశ తిరగడానికి ప్రధాన కారణం మోదీ--షాలు అనుసరించిన విజయసూత్రం: హిందూత్వ, సంక్షేమ సహాయాలు, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, మరీ ముఖ్యంగా ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం. దేశ రాజకీయాలలో మోదీ--షా ద్వయానికి తిరుగులేని ప్రాబల్యం లభించడం, పత్రికా స్వాతంత్ర్యం అణచివేత, గోది మీడియా ప్రభావశీలత పెరుగుదల ఏకకాలంలో జరిగాయి. టెలివిజన్ విషయంలో స్వేచ్ఛను అణచివేయడమేగాక న్యూస్ యాంకర్లను ప్రతిపక్షాలపైకి ఉసిగొల్పారు. ఆ యాంకర్ మహానుభావులు ప్రతిపక్షాలను అదేపనిగా తప్పుపట్టడమే కానీ ప్రభుత్వ జవాబుదారీతనాన్ని రవ్వంత కూడా ప్రశ్నించే పాపానికి పోరు. ఇదిలా ఉండగా దేశ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యం మరింతగా దిగజారిపోతోంది. గల్ఫ్ యుద్ధంతో పెరిగిన చమురు ధరలు ఇంకా దిగిరాలేదు. ఈ నేపథ్యంలో మన ఆర్థికవేత్తలు ప్రతిపాదిస్తున్న సంస్కరణలు చాలా ముఖ్యమైనవేగాక అత్యవసరమైనవి కూడా. ప్రభుత్వానికి వాటిని అమలుపరిచే సంకల్పం ఉన్నదా అన్నది ప్రశ్న. కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో (పుకార్లు నిజమైతే) రాజకీయ పార్టీలతో సంబంధం లేని వృత్తి నిపుణుడు అయిన ఆర్థికవేత్త ఒకరు మంత్రి అయ్యేందుకు అవకాశమున్నది. అయితే ఆర్థిక నిపుణులు సూచిస్తున్న సంస్కరణలు సార్థకంగా అమలుపరుస్తారా? నరేంద్రమోదీ, అమిత్ షా గురించి మనకు తెలిసిన దాన్నిబట్టి సహజంగానే కొన్ని ప్రశ్నలు ఉదయిస్తున్నాయి: ఆశ్రిత పక్షపాతాన్ని వారు ఎలా వదులుకుంటారు? స్వేచ్ఛా వాణిజ్య పోటీని ఎలా ప్రోత్సహిస్తారు? ప్రభుత్వ సంస్థలను మరింత సమర్థమైనవిగా, నిష్పాక్షికంగా ఎలా చేస్తారు? విధేయుల స్థానంలో నిపుణులను నియమిస్తారా? హిందూత్వవాదులు చట్టబద్ధ పాలనను ఉల్లంఘించకుండా ఎలా జాగ్రత్త వహిస్తారు?.. వీటన్నిటినీ తమ రాజకీయ లేదా వ్యక్తిగత ప్రయోజనాలకు హాని కలిగించని రీతిలో ఎలా చేస్తారు? చేయగలరు? సంస్కరణల తక్షణ ఆవశ్యకత గురించి సహేతుకంగా వాదించిన ఆర్థికవేత్తలను నేను అభిమానిస్తున్నాను, అభినందిస్తున్నాను. దేశం మేలు కోరి, వారు తమ నైతిక కర్తవ్యాన్ని ప్రశస్తంగా నిర్వహించారు. అయితే వారి అర్థవంతమైన సూచనలు చెవిటివాని ముందు శంఖం ఊదిన చందమే కావచ్చు సుమా!

# చదువులు చిదిమేస్తే చరిత్ర క్షమించదు

రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు విద్యారంగ సంస్కరణల పేరుతో వింత పనులతో విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. ఏదో ఆర్భాటపు హడావుడి తప్ప, ఆచరణాత్మక ప్రణాళికలను అమలు చేయడంలేదు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా ఆరుట్ల మరోసారి వంచనకు వేదికైంది. విద్యారంగంలో మార్పుల పేరుతో ఇప్పటికే ఆరుట్ల పేరును కాంగ్రెస్ పాలకులు వాడుకున్నారు. తాజాగా ఈ పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిల్లలకు అల్పాహారం పంపిణీ ప్రారంభానికి కూడా ఆరుట్ల పాఠశాలనే మరోసారి వేదిక చేశారు. ఆరుట్ల పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌కు ప్రయోగాత్మక మాడల్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పుకొచ్చారు. అదిగో అక్కడే అసలు తిరకాసు ఉన్నది. తెలంగాణ విద్యా వ్యవస్థ సంస్కరణ పేరిట ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ తెలంగాణ విద్యా సంస్కరణ పేరిట 355 పేజీల నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించింది. కానీ ఆ నివేదికను ప్రభుత్వం మూలకు పడేసింది. తెలంగాణ విద్యా కమిషన్, గత బడ్జెట్‌కు ముందే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. రూ.31,500 కోట్ల అంచనాతో చేపట్టాల్సిన చర్యలను సూచించింది. మండలానికి నాలుగు ఫౌండేషన్ స్కూల్స్, మూడు పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని తెలిపింది. వంద నియోజకవర్గాల్లో 400 పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. కానీ బడ్జెట్‌లో విద్యారంగానికి 8.2 శాతం మాత్రమే నిధులు కేటాయించింది. తెలంగాణ విద్యా ప్రణాళికలో ఆరుట్ల స్కూల్‌ను సక్సెస్ మాడల్‌గా పొందుపర్చారు. ఆ తర్వాత తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గురించి ముఖ్యమంత్రి మాటమాత్రంగా కూడా స్పందించలేదు. పాఠశాల పునఃప్రారంభానికి కొన్ని రోజుల ముందు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పదవికి రాజీనామా చేశారు. ఈ దశలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో వివాదాస్పద వ్యాఖ్య చేశారు. రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదిస్తామని ప్రకటించారు. సీఎం



ప్రకటనపై ఉపాధ్యాయ, ప్రజాసంఘాల ప్రతినిధులు తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రత్యామ్నాయం ఏంటో స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వ బడులు ఎలా మూసివేస్తారు? అనేది ప్రశ్న. బడుల మూసివేత ఎందుకు, పేద పిల్లల చదువుల సంగతేంటి? అనేది చర్చ జరుగుతున్న నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి ఆరుట్ల పాఠశాలనే తన ప్రచార వేదికగా ఎంచుకున్నారు. విద్యార్థులకు అల్పాహారం అందజేసే కార్యక్రమాన్ని అక్కడే ప్రారంభించారు. అక్కడి వేదికపై మాట్లాడుతూ ఆరుట్ల స్కూల్‌ను పబ్లిక్ స్కూల్ మాడల్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. అక్కడే అసలు విచిత్రం ఉన్నది. అప్పట్లోనే ఆరుట్ల స్కూల్‌ను తెలంగాణ పబ్లిక్ స్కూల్ మాడల్ అంటూ అసెంబ్లీ వేదికగా చూపించారు. మళ్లీ ఆరుట్లను ప్రయోగాత్మకంగా పరిశీలన చేస్తాం అనే మాట చాలా చిత్రంగా అనిపించింది. మరో ముఖ్య విషయం ఏమిటంటే రాజీనామా చేసిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి కూడా ఆరుట్ల సభా వేదికపై కనిపించారు. ఆ సభకు రెండు రోజుల ముందు కాక్రోచ్ జనతాపార్టీ సభలో ఆకునూరి మురళి పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శలు చేశారు. కానీ ముఖ్యమంత్రి సభలో పాల్గొని, ఆహా ఓహో అంటూ భిన్నమైన వైఖరిని ప్రదర్శించారు. అసలు ఆయన రాజీనామాను ప్రభుత్వం ఆమోదించిందా లేదా? అనేది స్పష్టతలేదు. విద్యావ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తుంటే విద్యాకమిషన్ చైర్మన్ ఎందుకు పూటకో మాట మాట్లాడుతున్నట్టు? ప్రభుత్వ బడులను మూసివేసి, ప్రైవేట్ పాఠశాలల అడ్డగోలు దోపిడీకి తెరతీసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. కానీ ఇదంతా కప్పిపుచ్చేందుకు పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా స్కూల్స్ అంటూ ఆర్భాటపు ప్రచారాన్ని వాడుకొంటున్నది. అంతే తప్ప రెండున్నరేండ్ల పాలనలో సాధించిన ఫలితాలు మాత్రం ఏమీలేవు. కానీ కోట్లాది రూపాయలు మాత్రం ఖర్చు అవుతూనే ఉన్నాయి. పాఠశాలల సంస్కరణ ప్రచారం సంగతి సరేసరి. ముఖ్యమంత్రి ప్రకటన ప్రకారం ఉన్న పళంగా ప్రభుత్వ పాఠశాలలు మూసివేస్తే ప్రైవేట్ విద్యా వ్యవస్థ నెత్తిన పాలుపోసినట్టే అవుతుంది. ప్రైవేట్ విద్యా వ్యవస్థ నియంత్రణ తర్వాతనే ప్రభుత్వ బడుల సంస్కరణపై దృష్టి పెట్టాలి. ఆ పని రేవంత్‌రెడ్డి చేయగలరా? అయితే పబ్లిక్ స్కూల్ ముసుగులో బడుల మూతకు రంగం సిద్ధం చేస్తున్నారా? ఏదీ ఏమైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మళ్లీ ఆరుట్లను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు ప్రయోగాత్మక మాడల్ అనడం మాత్రం చాలా విచిత్రంగా ఉన్నది. రెండున్నరేండ్ల పాలనలో విద్యా సంస్కరణలు మాటలకే పరిమితమయ్యాయి. నిరుడు సుమారు 4వేల ప్రభుత్వ బడులు మూతపడ్డాయి. ఈ ఏడాది ఇంకెన్ని పాఠశాలలకు మంగళం పాడుతారో తెలియదు. కామన్ స్కూల్ విధానం ద్వారా ఉన్న పాఠశాలలనే తెలంగాణా పబ్లిక్ స్కూల్స్‌గా మార్చాలి. ప్రభుత్వ బడి సంస్కరణల విషయంలో మాటలతో సరిపెట్టకుండా ఆచరణాత్మకంగా చర్యలు చేపట్టాలి. అంతేకానీ ప్రభుత్వ బడుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తూ విద్యా వ్యాపారానికి మరింత ఊతమిచ్చేలా వ్యవహరిస్తే చరిత్ర క్షమించదు.

శనివారం 20 జూన్ 2026
అగ్నిధార

# ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సహకారంతో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం

**ద్యాప నిఖిల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ ఉప సర్పంచ్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఊర్కొండ మండలంలోని గుండ్లగుంటపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ కొండపల్లి కొండల్ తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌డిఎఫ్ నిధులతో గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఇది కీలకమైన అడుగుగా నిలుస్తుందని అన్నారు. పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దడంలో ఈ డ్రైనేజీ వ్యవస్థ ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి నిరంతర సహకారం అందిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి, మాదారం మాజీ సర్పంచ్ ధ్యాప నిఖిల్ రెడ్డి సహకారాన్ని ఉపసర్పంచ్ ప్రత్యేకంగా అభినందించారు. వారి సహకారంతో గ్రామం మరింత వేగంగా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే నిధులు కేటాయించి అభివృద్ధి పనులకు సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. గ్రామస్తుల సహకారం మరువలేనిదని, అందరి భాగస్వామ్యంతో గుండ్లగుంటపల్లి గ్రామాన్ని అగ్రగామి గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## వెల్దండ మండల కేంద్రంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాహుల్ గాంధీ 56వ పుట్టినరోజుని పురస్కరించుకొని మండల పార్టీ అధ్యక్షుడు హరికిషన్ నాయక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కొయ్యల పుల్లయ్య ,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ అలుపెరుగని పోరాటం చేస్తున్నారని భరత్ గౌడ్ ఆయన సేవలను కొనియాడారు. రాహుల్ గాంధీ త్వరలో ప్రధాని పీఠాన్ని అధిరోహించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో, శివ గౌడ్,ఎండి అఫ్రోజ్, ఎండి సమీర్, సతీష , శివ,రాజేష్,ప్రవీణ్ ,గౌతమ్ తదితరులు ఉన్నారు

## వెల్దండలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపన వార్షికోత్సవం..



**ప్రత్యేక పూజలు చేసిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండల కేంద్రంతో పాటు చొక్కన్నపల్లిలో బొడ్రాయి ప్రతిష్టాపన 4వ వార్షికోత్సవం పూర్తయిన సందర్భంగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య పాల్గొని బొడ్రాయి అభిషేకం నిర్వహించి పూజలు నిర్వహించడం జరిగింది.ఉదయం నుంచి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, బొడ్రాయి, గ్రామ, కుల దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఉప సర్పంచ్ బస్నమోని శ్రీను ముదిరాజ్, పంచాయతీ కార్యదర్శి గిరి, వార్డు సభ్యులు కవిత రమేష్, వాణి పురుషోత్తం, మంజుల శ్రీను, శేఖర్, దేవేందర్, మల్లీశ్వరి రంగనాథం, వెంకటేష్ , మానస రాజు,రమేష్ , సునీత ఆనంద్ , రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యాబోధన

అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ :



ప్రభుత్వ బడులలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని ఆముదాల గడ్డ తండా సర్పంచ్ రాంచందర్ నాయక్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత అన్నారు. శుక్రవారం నాడు ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత ఆధ్వర్యంలో విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ టు దీటుగా పాఠశాలలో విద్యాబోధన అందిస్తున్నామని అన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులచే పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకట్రాములు , అంగన్వాడీ ఉపాధ్యాయురాలు అమృత,పాఠశాల ఉపాధ్యాయురాలు తిరుపతమ్మ, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## ఓటర్ జాబితా సమగ్ర సవరణను పారదర్శకంగా నిర్వహించాలి

**తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకురి ప్రభాకర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ చేపట్టనున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, బూత్ ఏజెంట్లు పని చేయాలని 2002 ఓటర్ లిస్ట్ ఆధారంగా నిర్వహించే సార్ వల్ల అనేక మంది ఓట్లు గల్లతయ్యే అవకాశం ఉంటుంది అందువల్ల టి పి సి సి ఆదేశం మేరకు మరియు కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సూచన మేరకు ఈనెల 25వ తారీకు నుండి ఇల్లు ఇల్లు తిరిగి ఓటర్ల జాబితాలను సరి చేసే కార్యక్రమాల సంబంధిత అధికారులు చేపట్టడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు.కనుక ఈ ప్రక్రియ ప్రారంభం నుండి గ్రామ కమిటీ ఉత్సాహంగా పనిచేస్తూ అధికారులతో సంప్రదింపులు జరుపుతు ఇంకా ఏమైనా సమాచారం కావలిస్తే ఆర్ డి ఓ ఎమ్మార్వో కార్యాలయంలో సంప్రదించాలనీ రాబోయే మండల జెడ్పీటీసీ ఎంపిటిసి ఎన్నికలు ఎమ్మెల్యే ఎన్నికలు కొత్తగా తయారయ్యే ఓటర్ల జాబితా ప్రకారం జరుగుతాయి ఓటర్ల జాబితాను నిర్లక్ష్యం చేస్తే అనేకమంది ఓట్లు పోతాయని కాబట్టి తలకొండపల్లి మండల కేంద్రంలోని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సెల్, యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు, కార్యకర్తలు హాజరు కాగలరని దోకూరి ప్రభాకర్ రెడ్డి కోరారు

## ఎమ్మెల్యే కసిరెడ్డి నీ కలిసిన ఎర్రవెల్లి గ్రామ భూ నిర్వాసితులు



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

చారకొండ మండలంలోని ఎర్రవెల్లి గ్రామ భూనిర్వాసితుల 200 వ రోజు దీక్షలో భాగంగా నేడు తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్ మరియు మాజీ ఎంపీపీ సాంబయ్య గౌడ్ సమక్షంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి నివాసంలో కలవడం జరిగింది. బాదితులు మాట్లాడుతూ, గ్రామంలో గత ఏడు నెలలగా జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు చేస్తున్నాము న్యాయం మాత్రం జరుగుతలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ, నా వంతు నేను ప్రాజెక్టు కట్టకుండా ఆపుతున్నాను అందుకు మీకు ఇచ్చిన మాట కోసం నేను మీ ఊరు బాగు కోసమే కష్టపడుతున్నాను ప్రాజెక్టును కట్టకుండా ఆపాలనే ప్రయత్నంలోనే ఉన్నాను అన్నారు.ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రద్దు చేయడం అనేది కొంత కష్టంతో కూడుకున్న పని అని వారు గ్రామస్తులకు వివరించడం జరిగినది.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఏకుల ప్రకాష్, అల్వాల పర్వతాలు గౌడ్, పబ్బు పెద్దయ్య గౌడ్, సుగూర్ శ్రీరామ్, మునవత్ సంజీవ, సిల్వేర్ రవి గౌడ్, మునవత్ బిక్కు, పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ద్యాప నిఖిల్ రెడ్డి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఊర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన దన్నడి తిరుపతయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ మాజీ అధ్యక్షులు ద్యాప నిఖిల్ రెడ్డి మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా 5000 అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముచ్చర్ల వీనిత ధర్మేందర్ రెడ్డి వార్డు సభ్యులు నితీష్, శివ నాయకులు శ్రీశైలం, తిరుపతయ్య, వెంకటేష్, నర్సిహ్మా, నిరంజన్ తదితరులు ఉన్నారు

## నిరుపేద కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటా



**బీటెక్ విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

మాడుగుల మండలం నాగిళ్ల గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని వడ్డమోని పావని తండ్రి యాదయ్య నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో ఆర్థిక పరిస్థితుల వలన పై చదువులకు స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి నీ సంప్రదించగా వెంటనే స్పందించి 15,000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్య ఎంతో కీలకమని, ప్రతిభ ఉన్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు ఆయన తెలిపారు. పావని విద్యలో మరింత రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్ మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్ మాజీ డైరెక్టర్ సురమల్ల సుభాష్ నాయకులు డొక్కా లింగం హానుమండ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## హరీశ్‌రావుకు వివాహ ఆహ్వానం అందజేసిన రాగుల రాజు ముదిరాజ్



అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వెల్ జగదేవపూర్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాగుల రాజు తన కుమార్తె వివాహానికి హాజరై వధువరులను ఆశీర్వదించాలని కోరుతూ మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే రాష్ట్ర ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డికి కూడా ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ కౌన్సిలర్ రొట్టెల శ్రీను గజ్వేల్ ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ మండల ముదిరాజ్ సంఘం నాయకులు కర్ణాకర్ ముదిరాజ్ బాల్ కిషన్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి జన్మదిన వేడుకలు



**శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు అభిమానులు**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ కుమార్,మాజీ మున్సిపాల్టీ ఛైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ జెడ్పీటీసీ హరిదాసు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెక్కర బాల్ రెడ్డి,చంద్రకాంత్ రెడ్డి,గంగాధర్,శ్రీకాంత్ రెడ్డి,పుస్తకాల రాహుల్, బీజేపీ నాయకులు మాజీ సర్పంచ్ నిరంజన్ గౌడ్,రాజశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ సహకారంతో నిరుపేద కుటుంబానికి చేయూత

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

అమంగల్ మున్సిపల్ లోని షేక్ ఇమ్రాన్ తండ్రి పేరు కరీం నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం తో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మ న్ ఉప్పల వెంకటేష్ నీ సంప్రదించగా స్టీల్ సిమెంట్ ఇవ్వడం జరిగింది. స్టీల్ సిమెంట్ ఇప్పించడం జరిగింది ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో, నేను మున్సిపల్ కౌన్సిలర్ వందేమాతరం చైర్మన్ పాపిశెట్టి రామన్న తదితరులు పాల్గొన్నారు



# చినుకు పడిందంటే అంధకారంలోకి జీడిపల్లి

**నరకయాతన అనుభవిస్తున్న జీడిపల్లి గ్రామ ప్రజలు**
**విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి అని కోరిన గ్రామ ప్రజలు**
**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



కల్వకుర్తి మండలం జీడిపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యలు రోజురోజుకూతీవ్రమవుతున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.జీడిపల్లి గ్రామంలో ప్రజలుప్రజలునిద్ర పోవాలంటే కరెంటు ఎప్పుడు వస్తుందా అని తెల్లారే వరకు వేచి చూడాల్సిందే,గ్రామ ప్రజలు విద్యుత్ సమస్యతో అల్లాడుతున్నారు.గ్రామంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు,వృద్ధులు,అనారోగ్యం పాలైన వారు చెమటలు కక్కుతూ ప్రతిరోజు కంటి నిండా నిద్ర లేక నరకయాతన అనుభవిస్తున్నారు. కరెంటు ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో అర్థం కాని దుస్థితిలో జీడిపల్లి గ్రామ ప్రజలు ఉన్నారు.చిన్న సమస్య కూడా పెద్ద ఇబ్బందిగా మారుతోందని వాపోతున్నారు.రోజుకు పదిసార్లకుపైగా విద్యుత్ సరఫరానిలిచిపోవడం,రాత్రి వేళల్లోగంటలతరబడి కరెంటులేకపోవడం వల్ల ప్రజలుతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.చిన్నపాటి వర్షం కురిసినా రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం పరిపాటిగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు.గత మూడు రోజులనుండి రాత్రి వేళలో కరెంటు ఎలాంటిగాలివాన రాకుండా పూర్తిగా బంద్ అవుతుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సమస్యలపై విద్యుత్ శాఖ అధికారులనుసంప్రదిస్తే ప్రకృతి వైపరీత్యాలను సాకుగాచూపుతూ బాధ్యత నుంచి!తప్పించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించిగ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని,విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ప్రజలను చీకట్లలో నెట్టేసి అధికారులు మౌనంగా ఉండడం తగదని వారు హెచ్చరిస్తున్నారు.గత కొన్ని సంవత్సరాలుగా ఈ విద్యుత్ సమస్యతో గ్రామస్తులు సతమవుతమవుతున్నకూడా విద్యుత్ శాఖసిబ్బంది తూతూ మంత్రంగాచర్యలు చేపడుతూచేతులు దులుపుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అసలేవర్షాకాలం గ్రామస్తులు గాలి వానలకు విష సర్పాలు సంచరిస్తూ ఉంటాయి.దీంతోవిషసర్పాలతో గ్రామస్తులు ఇబ్బందులకు గురి అయ్యే ప్రమాదం ఉందని గ్రామప్రజలఆందోళనవ్యక్తం చేస్తున్నారు.సమస్య ఉన్నచోట చెట్లు ఉండటంతో ఎండా కాలంలో చెట్లు తొలగించగా పోవడంతో కొన్నిచోట్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి అన్న వినికిడి గ్రామంలో వినిపిస్తుంది. అధికారులను విద్యుత్తు లేదు అని విద్యుత్ సిబ్బంది నిద్రమత్తు వీడి జీడిపల్లి గ్రామ కరెంటు సమస్యను వెంటనే తీర్చాలని లేనిచో ఏఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

# ముంచెత్తుతుతున్న నకిలీ పన్నీరు 825 కిలోల నాసిరకం సీజ్

**హైదరాబాద్ :** మీకు పనీర్ అంటే ఇష్టమా? పనీర్‌తో చేసిన వంటకాలు ఇష్టంగా లాగించేస్తున్నారా.. అయితే అది నిజమైనా పనీర్ కాదో తెలుసుకోవాలి. ఎందుకంటే మార్కెట్లో ఫేక్ పనీర్‌ను భారీగా విక్రయిస్తున్నారు. హైదరాబాద్‌లో పనీర్ పేరుతో జరుగుతున్న నకిలీ ఆహార ఉత్పత్తుల విక్రయాలపై హైదరాబాద్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. అసలైన పాల పదార్థాలకు బదులుగా కూరగాయల నూనెలు, ఇతర కొవ్వులతో తయారు చేసిన చీజ్ అనలాగ్ ఉత్పత్తులను విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్న వ్యాపారులు, కంపెనీల ఆటకట్టించారు. మార్కెట్లో వీటికి పనీర్, మిల్క్ పనీర్, మలై పనీర్ వంటి లేబుల్స్ అంటించి అసలైన పనీర్ అని విక్రయాలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్ ఫాస్ట్) నగరంలోని సుమారు 45 రిటైల్, హోల్‌సేల్ అవుట్‌లెట్లు, 8 తయారీ యూనిట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ దాడుల్లో దాదాపు 825 కిలోల నాసిరకం, కల్తీ పనీర్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ బృందాలు జరిపిన విచారణలో ఈ నకిలీ చీజ్ అనలాగ్ ఉత్పత్తులను ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుండి నగర అవసరాలకు తగ్గట్లుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తేలింది. లో ఫ్యాట్ పనీర్, మీడియం ఫ్యాట్ పనీర్, ఫ్రెష్ పనీర్ అనే పేర్లతో విక్రయించి క్యాష్ చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల తయారీదారు వివరాలు, ప్యాకింగ్, ఎక్స్‌పైరీ డేట్, బ్యాచ్ నంబర్ లాంటి ప్రాథమిక వివరాలు లేకుండానే నకిలీ పనీర్ అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై హైదరాబాద్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ ఓ ప్రకటన విడుదల చేశారు.హోల్‌సేల్ వ్యాపారులు, తయారీదారులు తమ ప్యాకెట్లపై చీజ్ అనలాగ్, నో డైరీ ఫ్యాట్ అని స్పష్టంగా ముద్రించినా, రిటైల్ వ్యాపారులు మాత్రం అధిక లాభాల ఆశతో వాటిని పనీర్ అని చెప్పి విక్రయిస్తున్నారు. వినియోగదారులు లేదా హోటల్ నిర్వాహకులు అసలైన పనీర్ కావాలని ఆర్డర్ చేసినప్పుడు, వారికి ఈ చీజ్ అనలాగ్ సరఫరా చేస్తున్నారు. ప్యాకెట్లపై ఉండే హెచ్చరికలను దాచిపెట్టి, ప్యాకెట్లు, ప్యాకేజింగ్ లేకుండా విడిగా విక్రయిస్తూ క్యాష్ చేసుకుంటున్నారు.ఈ దాడుల్లో ఎటువంటి చట్టబద్ధమైన ఈుూాంఎ (భారతీయ ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ) లైసెన్సులు లేకుండానే పలువురు వ్యాపారులు అక్రమంగా వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. వీరు భారీ మొత్తంలో చీజ్ అనలాగ్‌ను కొనుగోలు చేసి, ప్రీమియం పనీర్, లో ఫ్యాట్ పనీర్, ఫ్రెష్ పనీర్ అని లేబుళ్లు అతికించి విక్రయిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ నిర్ధారించింది.




**పనీర్ తయారీలో ప్రమాదకర పద్ధతులు**

సోదాల సందర్భంగా నకిలీ పనీర్ తయారీలో వాడుతున్న ప్రమాదకరమైన పద్ధతులు వెలుగుచూశాయి. పనీర్ బరువు, పరిమాణం పెంచడానికి ఇందులో స్టార్చ్ కలపడం, అధిక మోతాదులో నీటిని చేర్చడం, పాలు కాకుండా ఇతర కొవ్వులు, సింథటిక్ పాలను ఉపయోగించి అక్రమాలకు పాల్పడుతున్నారు. మనుషుల ఆరోగ్యానికి హాని కలిగించే ప్రమాదకర రసాయనాలను సైతం వాడుతున్నారని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ చేయడం, లేబెలింగ్ రూల్స్ ఉల్లంఘించడం వంటి తీవ్ర లోపాలను గుర్తించారు.

**అనారోగ్య సమస్యలు తప్పవు..**

ఫేక్ పనీర్ వంటి కల్తీ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ఫుడ్ పాయిజనింగ్, అలెర్జీలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న పనీర్‌ను టెస్టుల కోసం ల్యాబ్‌కు పంపించారు. వాటి రిపోర్ట్స్ రాగానే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హెల్త్ గురించి మరిన్ని అంశాలు తెలుసుకోవడానికి దీనిని క్లిక్ చేయండి.

**వినియోగదారులకు అధికారుల ముఖ్య సూచనలు**

- అధికారిక ఈుూాంఎ లైసెన్స్ కలిగిన గుర్తింపు పొందిన వ్యాపారుల వద్ద మాత్రమే పనీర్ కొనాలి.
- ప్యాకెట్‌పై ఉన్న లేబుల్, తయారీదారు పేరు, ఈుూాంఎ నంబర్, తయారీతో పాటు గడువు తేదీలను చెక్ చేయాలి.
- మార్కెట్లో లేబుల్ లేకుండా వదులుగా (ఒనీనీబవ) అమ్మే పనీర్ లేదా చీజ్ ఉత్పత్తులను కొనుగోలు చేయకపోవడమే శ్రేయస్కరం.
- ఎక్కడైనా నకిలీ ఆహార పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే ఆహార భద్రతా అధికారులకు ఫిర్యాదు చేయాలి.
- చీజ్ అనలాగ్ ఉత్పత్తులను విక్రయించే వ్యాపారులు అవి పాలేతర ఉత్పత్తులని స్పష్టంగా బోర్డులపై, లేబుళ్లపై ప్రకటించాల్సి ఉంటుంది. చీజ్ అనలాగ్‌ను రీప్యాక్ చేసి పనీర్‌గా విక్రయించడాన్ని నేరంగా పరిగణిస్తారు. మరోసారి నిబంధనలు ఉల్లంఘిస్తే దుకాణాలను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ స్పష్టం చేసింది.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**జగిత్యాల :** జగిత్యాల పట్టణంలోని పురాతన పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచిపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం సక్రమంగా, సమయానికి అందుతున్నదా అనే అంశాన్ని కూడా పరిశీలించారు . డైట్ మెను, వంటగది పరిశుభ్రత, నీటి వినియోగం, నిల్వ, కిచెన్ షెడ్‌ను ప్రత్యేకంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహా పంక్తి భోజనం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు దృష్ట్యా పోషకాహారం సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా అమలు చేసి, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు.



కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి కె. రాము, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బ్యాగరి వర్గానికి పనిముట్లు అందజేసిన బీఆర్ఎస్ నాయకుడు శేఖర్ రెడ్డి



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:**

మహమ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు శేఖర్ రెడ్డి తన సొంత ఖర్చులతో బ్యాగరి వర్గానికి అవసరమైన పనిముట్లను అందజేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు అంత్యక్రియల కోసం బొందలు తవ్వే సమయంలో బ్యాగరి వర్గానికి గడ్డపారలు, పారలు, గంపలు వంటి పనిముట్ల కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి వాటిని కొనుగోలు చేసి అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు అవసరమైన సమయంలో సేవలు అందించే బ్యాగరి వర్గానికి తగిన సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. బ్యాగరి వర్గానికి చెందిన వారు ఈ సహాయంపై హర్షం వ్యక్తం చేస్తూ శేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్. గాయత్రీ దేవి, మాజీ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బిక్షపతి, వార్డు సభ్యుడు ఈ. చిన్నారెడ్డి, గ్రామ నాయకులు తిరుమల్ రెడ్డి, డి. వెంకటేష్, లక్ష్మీకాంత్ రెడ్డి, జి. బాల్ రెడ్డి, మైబు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ శేఖర్ రెడ్డి చేసిన సేవా కార్యక్రమాన్ని ప్రశంసించారు.

## ప్రజలకు త్రాగు నీరు అందించడమే లక్ష్యం

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

జూలపల్లి గ్రామ ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా శుక్రవారం పెద్దపెల్లి జిల్లా కమాన్పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అంబేద్కర్ నగర్ లోని అంగన్వాడి స్కూల్ వద్దబోరు మోటర్ మరియు పెద్ద చెరువు కట్ట వాటా= ట్యాంక్ వద్దా బోరు మోటర్ జూలపల్లి సర్పంచ్ పోలుదాసరి వనిత సాయికుమార్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం రాజమహేందర్ పంచాయతీ కార్యదర్శి గుమ్మడి సదయ్య వార్డు సభ్యులు ఇరుగురాల రమేష్ బొల్లంపల్లి సంతోష్ కుమార్ స్థానిక మహిళలు యువకులు పాల్గొనడం జరిగింది

## కమాన్‌పూర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

**లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జూన్ 21న వైద్య సేవలు**
**అగ్నిధార న్యూస్ కమాన్‌పూర్**

కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ తెలిపారు.కమాన్‌పూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో అఖిర ఆస్పత్రి వైద్య బృందం సేవలు అందించనుంది. శిబిరంలో పాల్గొనే రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు న్యూరో సంబంధిత వ్యాధులు, నరాల సమస్యలు మరియు ఇతర సాధారణ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వైద్య సలహాలు అందజేయనున్నారు. అంతేకాకుండా వైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని లయన్స్ క్లబ్ ప్రతినిధులు కోరారు. కమాన్‌పూర్ పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు

## యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## చింతల రామచంద్రారెడ్డి మాజీ ఎమ్మెల్యే

**హైదరాబాద్ :** జూన్ 21ను ప్రపంచ యోగా దినోత్సవంగా 178 దేశాల మద్దతుతో ఐక్యరాజ్యసమితి గుర్తించింది. తెలంగాణలో 2016 నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో గత 7 సంవత్సరాలుగా యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. యోగా దినోత్సవానికి ఒక రోజు ముందు (జూన్ 20) “కౌంట్డౌన్ వన్ డే” కార్యక్రమం నిర్వహిస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల యోగా సంఘాల సహకారంతో కార్యక్రమం జరుగుతోంది. సుమారు 1 లక్ష మంది ఒకేసారి యోగా చేసేలా ఏర్పాట్లు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ లో కార్యక్రమం ఉదయం 5 గంటలకు ప్రారంభమవుతుంది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, బండారు దత్తాత్రేయ తదితర ప్రముఖులు హాజరవుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఇందిరా పార్కో కూడా యోగా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యోగా ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. షుగర్, బీపీ, ఒత్తిడి వంటి సమస్యలను నియంత్రించడంలో యోగా ఉపయోగపడుతుందని వివరించారు. సూర్యనమస్కారం, పద్మాసనం, వజ్రాసనం, సర్వాంగాసనం వంటి ఆసనాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రాణాయామం, అనులోమ-విలోమం వంటి సాధనలను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. కాలుష్యం, జీవనశైలి కారణంగా పెరుగుతున్న ఆరోగ్య సమస్యలకు యోగా మంచి పరిష్కారమని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రోత్సాహంతో ప్రపంచవ్యాప్తంగా యోగా ప్రాచుర్యం పొందిందని పేర్కొన్నారు.

## చీకోటి ప్రవీణ్‌ను విచారించిన సిట్

**హైదరాబాద్ :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇవాళ మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా బీజేపీ నేత చికోటి ప్రవీణ్‌ను బంజారాహిల్స్‌లోని సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించి, ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.విచారణ అనంతరం బయటకు వచ్చిన చికోటి ప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందంటూ గతంలోనే తాను డీజీపీకి ఫిర్యాదు చేశానని గుర్తుచేశారు. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో అత్యంత కీలక పాత్ర పోషించారని నేరుగా ఆరోపించారు. కేవలం కొందరివే కాకుండా, ఏకంగా 2 వేలకు పైగా ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేశారని అన్నారు.ఈ కేసు వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పెద్ద తలకాయల నిజాలు బయటకు రావాలంటే నిందితులకు వెంటనే ‘నార్కో అనాలసిస్ టెస్ట్’ చేయాలని ప్రవీణ్ డిమాండ్ చేశారు. అలాగే రాధాకిషన్‌రావు కూడబెట్టిన అక్రమ ఆస్తులపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలన్నారు. ఒకవేళ ఇక్కడి అధికారులు గనుక పట్టించుకోకపోతే.. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐలకు లేఖ రాస్తానని హెచ్చరించారు.

## చేనేత కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి వినతిపత్రం అందజేసిన మంత్రి కొండా సురేఖ

**వరంగల్ :** వరంగల్ జిల్లా చేనేత సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 50కు పైగా చేనేత సహకార సంఘాలకు చెందిన సుమారు 5,000 మంది చేనేత కార్మికులు గత మూడు దశాబ్దాలుగా రాష్ట్ర వస్త్రోత్పత్తి రంగానికి వెన్నెముకగా నిలుస్తున్నారు.

## బిజినెస్

# యాక్సెంచర్ షాక్.. కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు.. 1.35 లక్షల కోట్లు ఆవిరి





**ముంబై:** భారతీయ ఐటీ దిగ్గజ కంపెనీలు ఇవాళ అనూహమైన షాక్‌కు గురయ్యాయి. సుమారు 1.35 లక్షల కోట్ల విలువైన స్టాక్స్(×అఀఖుఅ కాశీఏ్ఎి మీుతీఏవం) కుప్పకూలినట్లు తెలుస్తోంది. గ్లోబల్ ఐటీ కన్సల్టెన్సీ యాక్సెంచర్ కంపెనీ ఇచ్చిన రెవన్యూ రిపోర్టు.. భారతీయ ఐటీ కంపెనీలను తీవ్రంగా షేక్ చేసింది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఐటీ కంపెనీల స్టాక్స్ దారుణంగా పడిపోయాయి. ఇన్ఫోసిస్ కంపెనీలో 8.5 శాతం ట్రేడింగ్ తగ్గిపోయింది. స్టాక్ ఎక్స్‌చేంజ్ ట్రేడింగ్‌లో ఇవాళ ఇన్ఫోసిస్ కంపెనీ షేర్లు 8.59 శాతం, టెక్ మహేంద్ర షేర్లు 7 శాతం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేర్లు 6.52, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 6 శాతం, విప్రో షేర్లు 4.29 శాతం పడిపోయాయి. యాక్సెంచర్ ఇచ్చిన ఆదాయ రిపోర్టు నేరుగా భారతీయ ఐటీ కంపెనీల స్టాక్స్‌పై ప్రభావం చూపింది. కృత్రిమ మేధ వల్ల వృద్ధి తగ్గనున్నట్లు ఇటీవల యాక్సెంచర్ కంపెనీ తన ఆదాయ రిపోర్టును అంచనా వేసింది. ఆ నివేదిక ఇప్పుడు భారతీయ ఐటీ కంపెనీల్లో వణుకు పుట్టించింది. శుక్రవారం స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్ ఒక్కసారిగా కుదేలైంది. టెకీ ప్రాజెక్టుల కోసం ఎక్కువగా ఇండియన్ కంపెనీలన్నీ యాక్సెంచర్ సంస్థపైనే ఆధారపడడం వల్ల.. యాక్సెంచర్ ఇచ్చిన రిపోర్టు భారత ఐటీ కంపెనీలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. యావత్ ఐటీ రంగానికి యాక్సెంచర్ వార్నింగ్ ఇవ్వడంతో.. పెట్టుబడిదారులు తమ స్టాక్స్‌ను తీసేసుకుంటున్నట్లు బజాజ్ బ్రోకింగ్ నిపుణుడు శశ్వంత్ సింగ్ తెలిపారు. గత అయిదు రోజుల నుంచి దూకుడును ప్రదర్శించిన స్టాక్ మార్కెట్లు ఇవాళ అనూహ్య రీతిలో స్పందించాయి. సెన్సెక్స్, నిఫ్టీల్లో ట్రేడింగ్ అకస్మాత్తుగా పడిపోయింది. యాక్సెంచర్ ఇచ్చిన గైడెన్స్ సందేశం. భారతీయ ఐటీ కంపెనీలను తీవ్ర భయాందోళనల్లోకి నెట్టేసినట్లు జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ తెలిపారు.

### పేపర్ ఖర్చులు రూ.986.4 కోట్లు..

మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ చెల్లింపులు, ఆన్‌లైన్ స్టేట్‌మెంట్లు ఇలా అన్నీ వేగంగా పెరుగుతున్నాయి, దీంతో బ్యాంకింగ్ రంగం పూర్తిగా డిజిటల్ అయిపోయిందని భావిస్తాం. కానీ.. వాస్తవానికి బ్యాంకుల లోపల ఇంకా భారీగా పేపర్ ఆధారిత వ్యవస్థ కొనసాగుతోంది. ఈ విషయం ఖీ25 గణాంకాల్లో స్పష్టంగా కనిపించింది. భారతదేశంలోని ప్రముఖ బ్యాంకులు ప్రింటింగ్, స్టేషనరీ, చెక్‌బుక్స్, పాస్‌బుక్స్, ఫార్మ్స్ వంటి అవసరాల కోసం ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రింటింగ్ అండ్ స్టేషనరీపై గ్రోవ్ సంస్థ నివేదికలు చెబుతున్నాయి. డిజిటల్ సేవలు పెరిగినా, సంప్రదాయ పేపర్ వర్క్ పూర్తిగా తగ్గలేదని ఈ గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో అతిపెద్ద బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉంది. ఖీ25లో ఈ బ్యాంక్ సుమారు రూ.986.4 కోట్లు ప్రింటింగ్, స్టేషనరీ కోసం ఖర్చు చేసింది. ఇదే సమయంలో ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా దాదాపు రూ.922.5 కోట్లు ఖర్చు చేయడం గమనార్హం. ఇతర ప్రధాన బ్యాంకుల విషయానికి వస్తే.. ఐసీఐసీఐ బ్యాంక్ సుమారు రూ.318.5 కోట్లు ఖర్చు చేసింది. అలాగే యాక్సిస్ బ్యాంక్ దాదాపు రూ.373.8 కోట్లు వెచ్చించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ వంటి సంస్థలు కూడా 1 శాతం పరిధిలోనే ఈ ఖర్చులను కొనసాగిస్తున్నాయి.

# రిలయన్స్ జియో ఐపీఓ.. ముకేశ్ అంబానీ కీలక ప్రకటన!




భారత టెలికాం, డిజిటల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన జియో ఇప్పుడు మరో కీలక ఘట్టానికి సిద్ధమవుతోంది. చాన్నాళ్లుగా వస్తున్న ఊహాగానాలు, పెట్టుబడిదారుల అంచనాలకు తెరదించుతూ రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ కీలక ప్రకటన చేశారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ 49వ వార్షిక సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ.. జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డు, డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ను ఆమోదించిందని, దానిని సెబీకి సమర్పించనున్నట్లు ముకేశ్ అంబానీ వెల్లడించారు. ఈ ప్రకటనతో భారత పెట్టుబడి మార్కెట్‌లో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జియో ఐపీఓకు అధికారికంగా శ్రీకారం చుట్టినట్లైంది. దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా ఇది నిలిచే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. జియో ఐపీఓ అనేది కేవలం ఒక వ్యాపార నిర్ణయం మాత్రమే కాదని, ఇది తనకు, రిలయన్స్ కుటుంబానికి, లక్షలాది వాటాదారులకు ఎంతో భావోద్వేగమైన క్షణమని ముకేశ్ అంబానీ అన్నారు. ఈ సందర్భంగా ముకేశ్ అంబానీ తన తండ్రి ధీరూబాయ్ అంబానీ వారసత్వాన్ని గుర్తు చేసుకున్నారు. తన తండ్రి కలలుగన్న "అందరి అభివృద్ధి" అనే లక్ష్యాన్ని తాను ముందుకు తీసుకువచ్చానని, ఇప్పుడు అదే బాధ్యతను తదుపరి తరం స్వీకరిస్తోందని చెప్పారు. తన పిల్లలు ఆకాష్, ఇషా, అనంత్ అంబానీలు జియో ఐపీఓ ప్రక్రియకు నాయకత్వం వహిస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో విలువ సృష్టించే కొత్త అవకాశాలను కూడా వారే ముందుండి నడిపిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

పదేళ్ల క్రితం జియో ప్రారంభమైనప్పుడు భారతదేశంలో డిజిటల్ అసమానతలను తొలగించడమే తమ లక్ష్యమని అంబానీ గుర్తుచేశారు. ఆ సమయంలో కాల్ ఛార్జీలు అధికంగా ఉండేవని, డేటా ఖరీదైనదిగా ఉండేదని, ఇంటర్నెట్ వేగం కూడా తక్కువగా ఉండేదని చెప్పారు. జియో వచ్చాక వాయిస్ కాల్స్, తక్కువ ధరలకు అధిక వేగం కలిగిన డేటా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఫలితంగా కోట్లాది భారతీయులకు డిజిటల్ జీవనశైలి చేరువైందని పేర్కొన్నారు. ప్రస్తుతం జియో దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ప్లాట్‌ఫామ్‌గా ఎదిగింది. 52.4 కోట్లకు పైగా వినియోగదారులను కలిగి ఉన్న ఈ సంస్థ, భారత టెలికాం రంగంలో అగ్రస్థానంలో ఉంది. జియో 5జీ సేవలకు 26.8 కోట్ల మంది వినియోగదారులు ఉండగా, జియో ఎయిర్‌ఫైబర్ ద్వారా 1.3 కోట్ల ఇళ్లకు కనెక్టివిటీ అందుతోంది. ఈ గణాంకాలే జియో ఎంత వేగంగా విస్తరించిందో తెలియజేస్తున్నాయి. జియో లిస్టింగ్ కేవలం ఒక వ్యాపార ప్రక్రియ మాత్రమే కాదని, భారతదేశం ప్రపంచ స్థాయి టెక్నాలజీ కంపెనీలను నిర్మించగలదని ప్రపంచానికి చూపించే అవకాశం అని ముకేశ్ అంబానీ అన్నారు. ప్రపంచ స్థాయి సామర్థ్యం, సాంకేతిక నైపుణ్యం, విలువ కలిగిన సంస్థలను భారత్ సృష్టించగలదని జియో నిరూపిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మార్కెట్ అంచనాల ప్రకారం, జియో ఐపీఓ ద్వారా సుమారు 4 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించే అవకాశం ఉంది. గతంలో ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జెఫరీస్ జియో విలువను సుమారు 180 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. ఈ అంచనాలు నిజమైతే, జియో ఐపీఓ భారత చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలిచే అవకాశముంది. ఇప్పటివరకు భారతదేశంలో అతిపెద్ద ఐపీఓగా హ్యుందాయ్ మోటార్ ఇండియా నిలిచింది. 2024 అక్టోబర్‌లో ఆ సంస్థ సుమారు రూ.27,870 కోట్లను సమీకరించింది. అయితే జియో ఐపీఓ ఆ రికార్డును అధిగమించే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.

# వామ్మో.. భారీగా తగ్గిన పసిడి ధరలు

దేశంలో బంగారం ధరలు భారీగా పడిపోయాయి. యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోత ఉండదన్న సంకేతాలతో పాటు డాలర్ మరింతగా బలపడటంతో బంగారం ధరలు భారీగా తగ్గాయి.

**వామ్మో.. భారీగా తగ్గిన పసిడి ధరలు**

ఇంటర్నెట్ డెస్క్: భారత్‌లో నేడు బంగారం ధరలు భారీగా పడిపోయాయి. యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోత ఉండదన్న సంకేతాలతో పాటు డాలర్ మరింతగా బలపడటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా పడిపోయాయి. దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఇదే ట్రెండ్‌ను అనుసరిస్తూ భారీగా పతనమయ్యాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (జూన్ 19) దేశంలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర సగటున రూ.3,650ల మేర పతనం కాగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.3,350ల మేర తగ్గింది. ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,45,860గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,33,700గా ఉంది. 18 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,09,390గా ఉంది.



# శుబ్‌మన్ సరికొత్త చరిత్ర.. తొలి భారత క్రికెటర్‌గా

టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఐపీఎల్-2026లో దుమ్ములేపిన గిల్.. ఇప్పుడు అదే జోరును అఫ్గానిస్తాన్ సిరీస్‌లో కనబరుస్తున్నాడు. లక్నో వేదికగా అఫ్గాన్‌తో రెండో వన్డేలో గిల్ అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. కేవలం 77 బంతుల్లోనే తన 9వ వన్డే సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఓవరాల్‌గా 110 బంతులు ఎదుర్కొన్న గిల్.. 22 ఫోర్లు, 2 సిక్స్‌లతో 154 పరుగులు చేశాడు. ఈ అద్భుత శతకంతో వన్డే క్రికెట్‌లో 3000 పరుగుల మైలురాయిని దాటాడు.


తద్వారా వన్డేల్లో అత్యంత వేగంగా 3000 పరుగులు చేసిన భారత ఆటగాడిగా గిల్ చరిత్ర సృష్టించాడు. ఈ ఫీట్‌ను గిల్ కేవలం 62 ఇన్నింగ్స్‌లలో అందుకున్నాడు. గతంలో ఈ రికార్డు శిఖర్ ధావన్, శ్రేయస్ అయ్యర్(72 ఇన్నింగ్స్‌లు) పేరిట సంయుక్తంగా ఉండేది. తాజా నాక్‌తో వారిద్దరిని శుబ్‌మన్ అధిగమించాడు. బంతులు పరంగా ఈ ఫీట్ సాధించిన జాబితాలో మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్(2995) అగ్రస్థానంలో ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో గిల్(3016) ఉన్నాడు. అదేవిధంగా వన్డేల్లో ఫాస్టెస్ట్ 150 చేసిన మూడో ప్లేయర్‌గా వీరేంద్ర సెహ్వాగ్‌ను గిల్ అధిగమించాడు. సెహ్వాగ్ 2011లో వెస్టిండీస్‌పై 112 బంతుల్లో ఈ ఫీట్ సాధించగా.. అఫ్గాన్‌తో మ్యాచ్‌లో గిల్ కేవలం 108 బంతుల్లో ఈ




ఘనతను అందుకున్నాడు. ఈ జాబితాలో ఇషాన్ కిషన్(103) అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 49.5 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోర్ చేసి ఆలౌటైంది.

# కెనడా, ఖతార్ మ్యాచ్.. ఆ ఒక్కడి కోసం తన్నుకున్న ఆటగాళ్లు!

ఫిఫా ప్రపంచకప్‌లో కెనడా, ఖతార్ మ్యాచ్ ముగిసిన తర్వాత ఇరుజట్ల ఆటగాళ్లు తన్నుకోవడం చర్చనీయాంశమైంది. కెనడా 6-0తో ఖతార్‌పై ఘన విజయాన్ని అందుకుంది. అయితే మ్యాచ్‌లో కెనడా విజయం సాధించినప్పటికీ ఖతార్ ఆటగాళ్ల వైఖరిని తప్పుబట్టారు. అందుకే ఒక్కసారి మ్యాచ్‌లో ఫైనల్ విజిల్ రాగానే కెనడా ఆటగాళ్లు ఖతార్ జట్టువైపు దూసుకొచ్చారు. దఇరుజట్ల ఆటగాళ్లు ఒకరిపై ఒకరు దాడి చేసుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో మైదానంలోకి వచ్చిన సెక్యూరిటీ ఇరుజట్లను వేరు చేసి అక్కడినుంచి పంపించేశారు. ఈ సమయంలో మైదానంలో గందరగోళం నెలకొంది. ఈ చర్యను ఇరుజట్ల కోచ్‌లు తప్పుబట్టారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. మరి కెనడా ఆటగాళ్ల కోపానికి కారణం ఏంటా అని ఆరా తీస్తే.. ఖతార్ ఆటగాళ్ల తప్పిదాల వల్ల కెనడా మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ కోనె కాలు విరిగింది. నడవడానికి కూడా ఇబ్బంది పడడంతో అతడిని స్ట్రెచర్‌పై తీసుకెళ్లాల్సి వచ్చింది. అయితే ఇస్మాయిల్ కోనె కాలు విరగడానికి ప్రధాన కారణం ఖతార్ ఆటగాడు అస్సిమ్ మదిబో. బంతిని పాస్ అందించడానికి ఇస్మాయిల్



ప్రయత్నిస్తున్న సమయంలో అతడికి అడ్డువచ్చిన అస్సిమ్ కావాలనే తను కాలును వెనుక నుంచి అడ్డుపెట్టాడు. దీంతో కోనె కాలు బోన్ విరిగిపోయింది. ఈ దుశ్చర్యతో రిఫరీ ఖతార్ ఆటగాడికి రెడ్‌కార్డ్ జారీ చేశాడు. మ్యాచ్ విషయానికొస్తే ఆతిథ్య కెనడా.. ఖతార్‌పై పూర్తి ఆధిపత్యం కనబరిచింది. జొనాథన్ డేవిడ్ హ్యాట్రిక్ గోల్స్‌తో కెనడా విజయంలో కీలకపాత్ర పోషించాడు.

## స్పోర్ట్స్

# భారత క్రికెట్‌కు గుడ్ బై.. వేరే దేశానికి ఆడనున్న తెలుగు ప్లేయర్



ఇటీవల భారత క్రికెట్‌కు వీడ్కోలు పలికిన టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్, ఆంధ్ర ప్లేయర్ కె.ఎస్. భరత్ మరో కీలక నిర్ణయం తీసుకున్నాడు. రిటైర్మెంట్ ప్రకటించిన కేవలం 15 రోజుల్లోనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో తన క్రికెట్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు భరత్ సిద్ధమయ్యాడు. యూఏఈ క్రికెట్ బోర్డు నిర్వహించనున్న స్థానిక టోర్నమెంట్‌లో 'టీమ్ స్టాలియన్స్' జట్టు తరపున భరత్ ఆడనున్నాడు. అయితే 32 ఏళ్ల శ్రీకర్ భరత్ వెంటనే యూఏఈ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం లేదు. ఐసీసీ నిబంధనల ప్రకారం.. ఫుల్ మెంబర్ నేషన్ నుంచి అసోసియేట్ దేశానికి వెళ్లే ఆటగాళ్లు మూడేళ్ల కూలింగ్-ఆఫ్ పీరియడ్‌ను పూర్తి చేయాలి. అయితే ఫిబ్రవరి 2024లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్‌లో భారత్ తరపున తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. అంటే అతడు యూఏఈ తరపున ఆడాలంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు వేచి ఉండాల్సిందే. ఈ విశాఖ క్రికెటర్ భారత్ తరపున 7 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 221 పరుగులు చేశాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో మాత్రం భరత్‌కు మంచి ట్రాక్ రికార్డు ఉంది. 113 ఇన్నింగ్స్‌లలో 36.53 సగటుతో 6102 పరుగులు చేశాడు. అతడి పేరిట ఓ ట్రిపుల్ సెంచరీ కూడా ఉంది. లిస్ట్-ఎ క్రికెట్‌లో కూడా అతడు అద్భుతంగా రాణించాడు. 83 మ్యాచ్‌లలో 2692 పరుగులు చేశాడు. ఇక తమ జట్టు అగ్రశ్రేణి ఆటగాళ్లలో లాంగ్-ఫార్మాట్ స్కిల్స్‌ను పెంపొందించే లక్ష్యంతో ఈసీబీ ఈ టూ-డే వైట్-బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నీని నిర్వహించనుంది. ఈ టోర్నీలో టీమ్ స్టాలియన్స్, టీమ్ ఫాల్కన్స్, టీమ్ ఈగల్స్, టీమ్ లెపర్డ్స్ మొత్తం నాలుగు జట్లు పాల్గొనున్నాయి.



# ‘అమరన్’ దర్శకుడితో ధనుష్ కొత్త మూవీ..

తమిళ స్టార్ నటుడు ధనుష్ 55వ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఊ55గా తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి ‘హవీ’ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ, మేకర్స్ ‘హవీ ఖీఱతీర్ ూ౯తీఱనివ’ పేరుతో అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు. దట్టమైన అడవులు, కొండల నడుమ సాగే ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా ఈ గ్లింప్స్ కట్ చేశారు. అమాయక గిరిజనులను సాయుధ బలగాలు చుట్టుముట్టగా, భయంతో ఉన్న వారంతా ఒక్కసారిగా “అణ్ణా మలైయార్‌కు!” అని నినదించే సీన్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. ఆ వెంటనే వర్షం, పొగమంచు మధ్య చేతిలో తుపాకితో ధనుష్ వయలెంట్ అవతారంలో ఎంట్రీ ఇస్తాడు. తుపాకులు పట్టుకున్న బలగాలతో ఒంటిచేత్తో తలపడే యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. ఈ చిత్రాన్ని మేకర్స్ మల్టీ-పార్ట్ సిరీస్‌గా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. మొదటి భాగాన్ని తీసుకొస్తున్నారు. ‘అమరన్’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో ‘హవీ’పై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, టాలెంటెడ్ హీరోయిన్ సాయి పల్లవి, యంగ్ సెన్సేషన్ శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఫస్ట్ స్ట్రైక్‌లో కేవలం ధనుష్ యాక్షన్ పోర్షన్ మాత్రమే చూపించి, మమ్ముట్టి, సాయి పల్లవి లుక్స్‌ను సస్పెన్స్‌గా ఉంచారు. సాయి పల్లవి ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని టాక్. యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. వండర్‌బార్ ఫిలింస్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. గ్లింప్స్‌తో పాటే రిలీజ్ డేట్‌ను కూడా అనౌన్స్ చేశారు. ‘హవీ’ చిత్రం 2026 అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.



# కాజల్ అగర్వాల్ బర్త్‌డేకు బాలయ్య గిఫ్ట్..

## NBK111లో హీరోయిన్‌గా ఎంట్రీ, ఫస్ట్ లుక్ విడుదల

నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం NBK111 నుంచి మేకర్స్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. నేడు హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో గత కొన్ని వారాలుగా ఈ ప్రాజెక్ట్‌పై నెలకొన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. ఈరోజు విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కాజల్ సింపుల్ చీరకట్టులో, కళ్లజోడు ధరించి అత్యంత గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె లుక్‌లో సీరియస్‌నెస్, పవర్‌ఫుల్ వైబ్ స్పష్టంగా కనిపిస్తోంది. స్టార్ హీరోయిన్‌ను ఇలా డీ-గ్లామర్ లుక్‌లో చూపించడంతో పాత్రపై క్యూరియాసిటీ ఒక్కసారిగా పెరిగింది. పోస్టర్‌తో పాటు చిత్ర బృందం కాజల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమా ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. ‘భగవంత్ కేసరి’ తర్వాత బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రమిది. ‘భగవంత్ కేసరి’లో కాజల్ పాత్రకు మంచి పేరు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే NBK111లో మాత్రం ఆమె పూర్తి స్థాయి కథానాయికగా, కథను మలుపు తిప్పే కీలక పాత్రలో కనిపించనుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్, ఎమోషన్‌ల మేళవింపుగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతోంది.

# ఫోక్ సింగర్ నాగదుర్గకు బంపర్ ఆఫర్..

**ఆ టాప్ బ్యానర్‌లో హీరోయిన్‌గా లక్కీ ఛాన్స్!**

‘కాపోల్ల ఇంటికాడా’, ‘పేరుగల్ల పెద్దిరెడ్డి’, ‘దారి పొంటొత్తుండు’ వంటి విలక్షణమైన జానపద గీతాలతో, తన అద్భుతమైన నృత్యంతో యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూస్ సొంతం చేసుకున్న ప్రముఖ ఫోక్ సింగర్, డాన్సర్ నాగదుర్గ టాలీవుడ్‌లో బంపర్ ఆఫర్ కొట్టేసింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తన మార్కు జానపద నృత్యాలతో సెన్సేషన్ సృష్టించిన ఈ తెలంగాణ జానపద కళాకారిణి, ఇప్పుడు ఏకంగా సిల్వర్ స్క్రీన్ పై హీరోయిన్‌గా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ప్రముఖ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కి చెందిన ‘సుకుమార్ రైటింగ్స్’ (ాబసఎబమ్ఘితీ ఔతీఊఱఅస్త్రం) మరియు సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ కి చెందిన ‘బన్నీ వాస్ ప్రొడక్షన్స్’ సంయుక్తంగా నిర్మిస్తున్న ఒక క్రేజీ ప్రాజెక్టులో నాగదుర్గకు హీరోయిన్‌గా లక్కీ ఛాన్స్ దక్కింది. ఈ సినిమాలో హీరోగా వైవిధ్యమైన పాత్రలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి నటించబోతున్నాడు. ఈ సినిమాతో వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే ‘కలివి వనం’ అనే ఓ విలక్షణమైన చిత్రంలో నటించిన నాగదుర్గ, ఆ తర్వాత తమిళంలోనూ ఓ క్రేజీ ప్రాజెక్ట్ లో నటించింది. ఇప్పుడు టాలీవుడ్ లోని మోస్ట్ సక్సెస్‌ఫుల్ బ్యానర్ల నిర్మాణంలో, ప్రియదర్శి సరసన లీడ్ రోల్ పొంది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. నాగదుర్గ పల్లెటూరి నైపథ్యం, ఆమె సహజ సిద్ధమైన నటన, హావభావాలు ఈ చిత్రానికి ప్రధాన బలం కానున్నాయని తెలుస్తోంది. ఈ కాంబినేషన్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు, టైటిల్ మరియు పూర్తి నటీనటుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కబోతున్నట్లు సమాచారం





# భారీతనంతో ఆకట్టుకునేలా ‘నాగబంధం’ ట్రైలర్

రూ.100 కోట్ల బడ్జెట్ అనగానే సాధారణంగా పేరున్న హీరోలనే పెడుతుంటారు. కానీ ఒక సినిమాలో నటించిన అనుభవమున్న విరాట్ కర్ణ అనే కుర్రాడిని పెట్టి తీసిన చిత్రం ‘నాగబంధం’. అనంత పద్మనాభ స్వామి బ్యాక్ డ్రాప్ స్టోరీతో దీన్ని తీశారు. వచ్చే నెల 3న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. భారీతనంతో ఇది ఆకట్టుకుంది. ట్రైలర్ బట్టి చూస్తే అనంత పద్మనాభ స్వామి దేవాలయంలోని స్వర్ణపుష్పం దక్కించుకునేందుకు కొందరు విలన్స్ ప్రయత్నిస్తుంటారు. ఈ ప్రయాణంలో హీరో వాళ్లకు సాయపడాల్సి వస్తుంది. తర్వాత ఏమైంది? హిమాలయాల్లో ఉండే నాగసాధువులు ఎందుకు వచ్చారు? లాంటి అంశాలే స్టోరీలా అనిపిస్తుంది. ప్రతి ఫ్రేమ్‌లో భారీతనం కనిపించింది. యాక్షన్, రక్తపాతం కూడా గట్టిగానే చూపించారు. నభా నటేశ్ హీరోయిన్ కాగా అభిషేక్ నామా దర్శకుడు. ఇందులో నటించిన చాలామంది కొత్తవాళ్లే. వీళ్లపై రూ.100 కోట్ల బడ్జెట్ పెట్టేశారు. మరి తెలుగు ప్రేక్షకుల్ని ఇది ఏ మేరకు మెప్పిస్తుందనేది చూడాలి?

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com